పాలస్తీనాకు బాసటగా నిలుద్దాం

- ఢిల్లీలో సిపిఐ(ఎం) భారీ ధర్నా
- మోడీ ప్రభుత్వ తీరుపై విమర్శలు

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 89 | విజయవాడ, సోమవారం 30 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 30 October 2023 | Rs

సిక్సర్‌తో సెమీస్‌కు!

- సెమీఫైనల్లో టీమ్ ఇండియా
- ఇంగ్లాండ్‌పై ఘన విజయం ఐసీసీ 2023 ప్రపంచకప్

లోపలి పేజీలో..

విజయనగరం సమీపంలో

ఘోర రైలు ప్రమాదం

ఆగి ఉన్న రైలును ఢీకొన్న మరో రైలు

8 మంది దుర్మరణం • వంద మందికి గాయాలు

- అంధకారంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- క్షతగాత్రులను విజయనగరం, విశాఖ, ఎస్ కోట తరలింపు
- పట్టాలు తప్పిన నాలుగు బోగీలు

విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లక్కవరపుకోట మండలం భీమాళి సమీపాన రాత్రి 7.10 గంటల సమయంలో జరిగిన దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు ప్రకటించారు. కాగా, 20 మందికి పైగా మరణించి ఉంటారని స్థానికులంటున్నారు. వందమంది వరకూ గాయపడినట్లు సమాచారం. విశాఖ నుంచి పలాస వెళ్తున్న పాసింజర్ రైలు కంటకాపల్లి దాటిన తరువాత భీమాళి సమీపాన ఎలక్ట్రికల్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా లేక నిలిచిపోయింది. దాని వెనకే వస్తున్న పాసింజర్ రైలుకు కంటకాపల్లి స్టేషన్‌లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ రైలు వచ్చి పలాస రైలును ఢీకొంది. ఈ రెండు రైళ్లకు చెందిన నాలుగు బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రధాని నరేంద్రమోడీ, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ అబ్దుల్ నజీర్, వివిధ పార్టీల నేతలు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పన, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పన సిఎం నష్టపరిహారం ప్రకటించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మృతులకు రూ.2 లక్షల చొప్పన, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పన సహాయం అందించాలని సిఎం జగన్ అధికారులను ఆదేశించారు.

- వివరాలు లోపలిపేజీల్లో

కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నెంబర్లు

విజయనగరం కలెక్టరేట్ 9493589157

విజయనగరం రైల్వే స్టేషన్ 8978080006

విశాఖ రైల్వే కంట్రోల్ రూం 8978080777

ప్రధాని, సిఎం దిగ్భ్రాంతి, సహాయక చర్యలకు ఆదేశం

మృతుల కుటుంబాలకు రాష్ట్రం 10లక్షలు, కేంద్రం 2లక్షలు ఎక్స్‌గ్రేషియా

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఎం

ప్రజా సమస్యలే అజెండా

నేటి నుండి ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రలు

- కరువును వదిలేసి రాజకీయ ప్రచారంలో మునిగిపోయిన ప్రభుత్వం
- పాటల సిడి, పోస్టర్, బుక్‌లెట్స్ ఆవిష్కరణలో వి.శ్రీనివాసరావు

పాటల క్యాసెట్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, బాబూరావు, సీతారాం, వై వెంకటేశ్వరరావు, వి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కరువు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, భూ సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే అధికార వైఎస్సార్ కాంగ్రెస్ ప్రజాసమస్యలను గాలికి వదిలి రాజకీయ ప్రచారం కోసం బస్సు యాత్రలను చేపట్టడం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. తక్షణం రాష్ట్రంలో కరువును అధిగమించేందుకు, భూసమస్యలు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలే అజెండాగా తమ పార్టీ సోమవారం నుండి ప్రజా రక్షణ భేరి పేరుతో ప్రచార జాతాలను చేపట్టిందని తెలిపారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ప్రజా రక్షణ భేరి ప్రచారజాతాలకు సంబంధించి పాటల సిడి, పోస్టర్‌లతోపాటు రాష్ట్రంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రూపొందించిన తొమ్మిది పుస్తకాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం, సిహెచ్ బాబురావు, వి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడారు. కరువు, వెనుకబడిన ప్రాంతాల్లో పర్యటించేలా చేపట్టిన ప్రజారక్షణ భేరి ప్రచార జాతా సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్‌రెడ్డిల

మిగతా 2లో

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా

అనంత్ నాథ్

న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షులుగా అనంత్ నాథ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన 'ది కార్వాన్' పత్రిక సంపాదకులుగా పనిచేస్తున్నారు. శనివారం జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలను నిర్వహించారు. ఎడిటర్స్ గిల్డ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అనంత్ నాథ్.. సీమా ముస్తఫా స్థానంలో అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అలాగే శనివారం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా రుబెన్ బెనర్జీ (అవుట్ లుక్ పత్రిక మాజీ ప్రధాన సంపాదకులు), కోశాధికారిగా కెవి ప్రసాద్ (ది ట్రిబ్యూన్ పత్రిక మాజీ సీనియర్ అసోసియేట్ ఎడిటర్)ను ఎన్నుకున్నారు. శ్రీరామ్ పవార్ (సకల్ మీడియా గ్రూప్ ఎడిటర్) స్థానంలో ప్రసాద్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. రాజ్‌దీప్ సర్‌దేశాయి, విజయ్ నాయక్, కుంకుమ్ చఢలతో కూడిన ముగ్గురి సభ్యుల ఎలక్షన్ కమిటీ ఈ ఎన్నికల వివరాలను ప్రకటించింది.

బెట్టకు వచ్చిన వరి



తెనాలి మండలం హాఫ్‌పేటలో ఎండిపోయిన వరిపొలం

- కృష్ణా డెల్టాలో సాగునీటి సంక్షోభం
- పట్టిసీమ, పులిచింతల నుంచి నీరు వస్తున్నా చాలని వైనం
- నిర్వహణ లోపంతో రైతులకు ఇక్కట్లు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా డెల్టాలో ఏర్పడిన సాగునీటి సంక్షోభం రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గత నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో వరి సాగు బెట్టకు వచ్చింది. గుంటూరు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణాల పరిధిలో దాదాపు 8.10 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇప్పటికే దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి పంట బెట్టకు వచ్చింది. ఐదు లక్షల ఎకరాల్లో కొంత వరకు నిలదొక్కుకుంటోంది. మరో పది రోజులు వర్షాలు పడకపోతే బెట్టకు వచ్చే పంట విస్తీర్ణం మరింత పెరగనుంది. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. దీంతో, రైతులు మరో 40 రోజుల్లో కోతలకు సిద్ధం కానున్న తరుణంలో పంట ఎందుకూ పనికి రాకుండా పోతుందోమోనని ఆందోళన చెందుతున్నారు. వరి పైరు బెట్టకు రావడంతో పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం పడుతోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసినా చివరి భూములకు చేయడం లేదు. డెల్టా కాల్వల మరమ్మతుల సకాలంలో చేయకపోవడం వల్ల కూడా పొలాలకు నీరు సక్రమంగా అందని పరిస్థితి ఉంది. ఎక్కువ మంది రైతులు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనివల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. వరి పొట్ట దశకు రావడంతో నీటి అవసరం పెరిగింది. గత నెల రోజులుగా డెల్టా ఆయకట్టు పరిధిలో కనీస వర్షం లేదు. 2003లో ఏర్పడిన కరువు పరిస్థితులు మళ్లీ 20 ఏళ్లకు చూస్తున్నామని రైతులు చెబుతున్నారు. పట్టిసీమ, పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి ఆదివారం సాయంత్రం నుంచి 14,370 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కానీ, బ్యారేజీకి కేవలం 10,650 క్యూసెక్కులు మాత్రమే వస్తోంది. గోదావరిలో కూడా నీటిమట్టం తగ్గడం, 24 పంపులకుగాను 17 పంపులే పనిచేయడం వల్ల పట్టిసీమ నుంచి ఆశించిన నీటిని ప్రకాశం

మిగతా 2లో

ప్రార్థనా సమావేశంలో

పేలుడు

- ఇద్దరు మృతి
- 40 మందికి గాయాలు
- కేరళలోని కలామస్సేరిలో ఘటన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతనిధి - తిరువనంతపురం

కేరళలోని కొచ్చి నగరానికి సమీపంలో కలామస్సేరిలో ఆదివారం జరిగిన పేలుడు ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో 40 మంది గాయపడ్డారు. కలామస్సేరిలోని అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో 'జెహోవా సాక్ష్యం' పేరిట మూడు రోజుల ప్రత్యేక ప్రార్థనా కూటమి నిర్వహించారు. ఐఇడి (ఇంప్రూవైజ్డు ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్)ని ఈ పేలుళ్లలో ఉపయోగించినట్లు కేరళ రాష్ట్ర డిజిపి ధార్వేష్ సాహెబ్ ఆదివారం తిరువనంతపురంలో విలేకరులకు తెలిపారు. పేలుడు జరిపింది తానేనని త్రిస్సూర్‌కు చెందిన డొమినిక్ మార్టిన్ అనే వ్యక్తి పేర్కొన్నాడు. ఈ మేరకు అతను ఫేస్‌బుక్ వెబ్‌సైట్‌లో ఒక వీడియో పోస్టు చేశాడు. తరువాత ఆ ఫేస్‌బుక్ పేజీని అదృశ్యం చేశాడు. 'ప్రార్థనలు నిర్వహిస్తున్న సంస్థ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. వారి సైద్ధాంతిక భావాలు దేశానికి వ్యతిరేకమైనవి. జాతీయగీతం పాడరాదని, సైనిక సర్వీసుల్లో చేరవద్దని ప్రజలను ఆ సంస్థ ప్రేరేపిస్తోంది' అని మార్టిన్ ఆరోపించాడు. ఆన్‌లైన్ ద్వారా బాంబు తయారు చేయడం నేర్చుకొని, టిఫిన్ బాక్స్‌లో బాంబులు ఉంచి రిమోట్ కంట్రోల్ ద్వారా పేల్చినట్లు సదరు నిందితుడు పేర్కొన్నాడు. త్రిస్సూర్‌లోని కొడకర పోలీసు స్టేషన్‌లో మార్టిన్ లొంగిపోయాడు. తాను కూడా క్రైస్తవుడినేనని పేర్కొన్నాడు. అయితే అన్ని కోణాలనుంచి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని శాంతిభద్రతల విభాగపు ఎడిజిపి ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. కాగా సిసిటివి దృశ్యాలు, మార్టిన్ మొబైల్ ఫోన్లలోని దృశ్యాలను పరిశీలించిన మీదట ఈ ఘాతుకానికి మార్టినే ఒడిగట్టి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడి మొబైల్ ఫోన్లలోని గూగుల్ సెర్చ్ హిస్టరీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. బాంబు

మిగతా 5లో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడతాం

- ప్రజలను చైతన్యపరుస్తాం
- 'ప్రజాశక్తి'తో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

ప్రజారక్షణ భేరి యాత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడతామని, ప్రజలను చైతన్యపరుస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ చెప్పారు. సోమవారం కర్నూలు జిల్లా ఆదోని నుంచి బస్సు యాత్ర ప్రారంభమై 13 జిల్లాల్లో పర్యటించి నవంబర్ తొమ్మిదిన గుంటూరు జిల్లా తాడేపల్లిలో ముగియనుంది. ఈ యాత్రకు నాయకత్వం వహించే గఫూర్ 'ప్రజాశక్తి'తో ముఖాముఖిగా మాట్లాడారు.

బస్సు యాత్ర ఎలా సాగనుంది?

గఫూర్ : సోమవారం కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 9న గుంటూరు జిల్లా తాడేపల్లి వరకూ 13 జిల్లాలను కవర్ చేస్తూ సాగనుంది. కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బస్సు యాత్ర సాగుతుంది. పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు ఉంటాయి. బస్సు యాత్ర తరువాత నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. ఈ ప్రచారం బహిరంగ సభకు జనసమీకరణకు కూడా తోడ్పడుతుంది.



బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం ఏమిటి?

గఫూర్ : బస్సు యాత్ర ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడతాం. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలనే తపన తప్ప ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి పట్టడం లేదు. ప్రజా సమస్యల వైపు ప్రజల ఆలోచన మళ్లింపజేస్తాం. బటన్ నొక్కడమే అభివృద్ధి అని వైసిపి, రాజధాని అమరావతి అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అని టిడిపి చెబుతున్నాయి. అసమానతలు లేని అభివృద్ధి చేయాలనేది సిపిఎం ప్రధాన డిమాండ్. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల ప్రత్యేక సమస్యలు పరిష్కరించాలి. అమరావతి రాజధానిగా ఉంటూ అన్ని జిల్లాలనూ అభివృద్ధి చేయాలి. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయడం లేదు. రాష్ట్రంలోని మూడు పార్టీలూ బిజెపి ఏమీ చేయకున్నా ఆ పార్టీతో అంటకాగుతున్నాయి. రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి పాలన శాపంగా మారింది. కేంద్ర ప్రభుత్వాన్ని ముద్దాయిగా నిలబెట్టే ప్రయత్నాన్ని బస్సు యాత్ర ద్వారా చేస్తాం. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీల వల్ల రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడుతున్నాయి. మతోన్మాద శక్తులు బలపడితే రాష్ట్రం నాశనం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ద్రోహాన్ని గురించి చెబుతూ రాష్ట్రంలోని పార్టీల వైఖరి గురించి ప్రజలను చైతన్య పరచడమే బస్సు యాత్ర ప్రధాన ఉద్దేశం.

ఇంకా వేటి గురించి ప్రజలకు వివరించనున్నారు?

గఫూర్ : విభజన హామీలు, నీటి పారుదల ప్రాజెక్టులు, కృష్ణా జలాలతో పాటు వేదవతి, గుండ్రేవుల వంటి స్థానికంగా ఉండే ప్రధాన సమస్యల గురించి బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తాం.

బస్సు యాత్ర బృందంలో ఎవరెవరుంటారు?

గఫూర్ : నాతోపాటు వి.కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, రమాదేవి, భాస్కరయ్య తదితరులు ఉంటారు.

సమానతలు లేని అభివృద్ధి కోసం
CPM
15 నవంబర్ 2023 - విజయవాడ
ప్రజారక్షణ భేరి

ఎన్నికల్లో ఎవరితో కలిసి వెళ్లే అవకాశం ఉంది?

గఫూర్ : ఎన్నికల ఎత్తుగడలు ఇంకా చర్చగానే ఉంది. బిజెపితో కలిసి ఉండే ఏ పార్టీతోనూ సర్దుబాట్లు ఉండవు.

రాయలసీమ పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏంటి?

గఫూర్ : రాయలసీమకు టిడిపి హయాంలో అన్యాయం జరిగింది. వైసిపి హయాంలో మరీ ఘోరంగా అన్యాయం జరుగుతోంది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు కర్నూలు ఎస్‌ఎపి క్యాంప్‌లో నిర్వహించారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. ఏ ఒక్కటీ అమలు చేయలేదు. చంద్రబాబును తిడితే సరిపోతుందని జగన్ అనుకుంటున్నారు. అభివృద్ధి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

విజయనగరం జిల్లాలో ఘోర రైలు ప్రమాదం

- ఆగి ఉన్న రైలును ఢీకొన్న మరో రైలు
- 8 మంది దుర్మరణం
- వంద మందికి గాయాలు !
- అంధకారంలో ఘటనా స్థలం
- సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- క్షతగాత్రులను విజయనగరం, విశాఖ, ఎస్‌కోట తరలింపు
- కలెక్టరేట్, రైల్వేస్టేషన్‌లో హెల్ప్ లైన్ ఏర్పాటు

రైలు ప్రమాదంలో గాయపడిన చిన్నారి

గాయపడిన వారిని ఆస్పత్రికి అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

ఘటనా స్థలిలో పడివున్న ప్రయాణికుని మృతదేహం

ప్రజాశక్తి- యంత్రాంగం

విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం భీమాళి సమీపాన ఆదివారం రాత్రి 7.10 గంటల సమయంలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం.

ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అయితే, మృతుల సంఖ్య 20పైనే ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. వందమంది వరకు గాయపడినట్లు సమాచారం. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... విశాఖ నుంచి పలాస వెళ్తున్న పాసింజర్ రైలు కంటకాపల్లి దాటిన తరువాత భీమాళి సమీపాన ఓవర్‌హెడ్ కేబుల్ తెగిపడడంతో విద్యుత్ సరఫరా లేక పట్టాలపై నిలిచిపోయింది. దాని వెనుకే వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలుకు కంటకాపల్లి స్టేషన్‌లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ రైలు స్పీడ్‌గా వచ్చి విశాఖ-పలాస రైలును బలంగా ఢీకొంది. దీంతో, ఈ రెండు రైళ్లకు చెందిన చెరో రెండు బోగీలు పట్టాలు తప్పడమే కాకుండా నుజ్జునుజ్జయ్యాయి. పెద్ద శబ్దం రావడంతో వెంటనే భీమాళి తదితర గ్రామాల ప్రజలు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు, విజయనగరం జిల్లా అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేశారు. రాత్రి 11 గంటల వరకు ఎనిమిది మంది మృతదేహాలను బయటకు తీశారు. మృతుల్లో విజయనగరం జిల్లా జామి మండలం గడికొమ్ము గ్రామానికి చెందిన కె. రవి (30), గదబవలసకు చెందిన మజ్జి రాము, గరివిడి మండలం కాపుశంబాం గ్రామానికి చెందిన గిరిజాల లక్ష్మి, శ్రీకాకుళానికి చెందిన ఆకుల నాయుడు, విశాఖ-రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్ ఉన్నట్లు గుర్తించారు. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్తున్నారు. సుమారు వంద మంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. రైళ్లు ఢీకొనడంతో ఘటనా స్థలంలో విద్యుత్ తీగెలు తెగిపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారం నెలకొంది. దీంతో, సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. రైళ్లలో ప్రయాణికులను స్వగ్రామాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి బస్సులను రప్పించి ప్రయాణికులను తరలించారు. జిల్లాలోని పలు అగ్నిమాపక వాహనాలు చేరుకొని సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి. క్షతగ్రాతులను విజయనగరం, విశాఖ, ఎస్‌కోట తరలించారు.

కంట్రోల్ రూముల ఏర్పాటు

బాధితుల సహాయం కోసం విజయనగరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కె.నాగలక్ష్మి తెలిపారు. బాధితుల సహాయ సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో 9493589157 ఫోన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాధితుల సహాయ సమాచారం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఫోన్ నంబర్ 8978080006కు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. విశాఖలో రైల్వే కంట్రోల్ రూం 8978080777 నంబర్‌తో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆగిన రైళ్లు... ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ప్రమాదంతో రైలు భోగీలు పక్కనున్న పట్టాలపై ఎగిరిపడడంతో అటు విశాఖపట్నం, ఇటు రాయగడ, భువనేశ్వర్‌వైపు వెళ్లాల్సిన పలు రైళ్లు విజయనగరం రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయాయి. సికింద్రాబాద్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, చెన్నై వెళ్లే సంత్రగంజ్, కోర్బా తదితర రైళ్లు నిలిచిపోయాయి. గొట్లాం స్టేషన్‌లో సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులంతా రైలులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్షతగాత్రులకు సిపిఎం నాయకుల పరామర్శ

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి క్షతగాత్రులను అంబులెన్సుల్లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు జి.శ్రీనివాస్ పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు చేరుకొని క్షతగాత్రులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

గవర్నర్, సిఎం దిగ్భ్రాంతి
సహాయక చర్యలకు అధికారులకు ఆదేశం

రైలు ప్రమాద దుర్ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్స్‌లను పంపించాలని, మంచి వైద్య అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. వైద్య ఆరోగ్య, పోలీసులు, రెవెన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఎం

రైలు ప్రమాదంలో మరణించిన వారికి సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. గాయపడిన వారికి అత్యవసర సహాయం అందించి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. బలాసోర్ (ఒడిశా) ప్రమాదం మరిచిపోకముందే సిగ్నల్ కారణంగా మరో రైలు ప్రమాదం అదే లైనులో జరగడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. రైల్వే సామర్థ్యాన్ని పెంచడానికి బదులు ప్రయివేటీకరణ విధానాలతో ప్రయాణికుల ప్రాణాలతో చలగాటమాడడం క్షంతవ్యం కాదని తెలిపారు. ఈ ప్రమాదాలకు బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : లోకేష్

రైలు ప్రమాదంపై టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో క్షతగాత్రులైన వారికి ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని ఒక ప్రకటనలో కోరారు. సమీపంలోని టిడిపి కార్యకర్తలు తక్షణమే ప్రమాద స్థలానికి వెళ్లి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గాయపడిన, మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరారు.

సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న మంత్రి బొత్స

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బొత్స

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సూర్యకళ, ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో శ్రీకాకుళం ఎంపి కె.రామ్మోహన్‌నాయుడు ఉన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఎం

విజయనగరం జిల్లా కంటకాపల్లి దగ్గర జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాయపడిన వారికి అత్యవసర సహాయం అందించి, ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలాసోర్ (ఒరిస్సా) ప్రమాదం మరిచిపోకముందే సిగ్నల్ కారణంగా మరో రైలు ప్రమాదం అదే లైనులో జరగడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తున్నదన్నారు. రైల్వే సామర్థ్యాన్ని పెంచడానికి బదులు ప్రయివేటీకరణ విధానాలతో ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడడం క్షంతవ్యం కాదన్నారు. ఈ ప్రమాదాలకు బాధ్యత వహించి కేంద్ర రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాని దిగ్భ్రాంతి

విజయనగరం రైలు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ. 50 వేల సాయం అందిస్తామని తెలిపారు. ప్రమాద ఘటనపై రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌తో సమీక్షించారు. బాధితులకు అన్ని రకాల సహాయం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మరణించిన వారికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పరిస్థితి అదుపులోనే ఉంది : రైల్వే మంత్రి

రెండు పాసింజర్ రైళ్లు ఢీకొన్న అనంతర పరిస్థితి అదుపులోనే ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఆయన ఎఎన్ఐ వార్తా సంస్థ తో మాట్లాడుతూ, ప్రధాని పరిస్థితిని సమీక్షించారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రితో తాను మాట్లాడానని పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉన్నట్లు తెలిపారని అన్నారు.

నూర్‌భాషాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- గుంటూరులో సింహగర్జన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో నూర్‌బాషాలకు అన్ని పార్టీలూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని నూర్‌బాషాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీర్ మహమ్మద్ కోరారు. నూర్‌బాషా, దూదేకుల ముస్లిమ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని ముస్లిమ్ కళాశాలలో రాష్ట్ర సదస్సు సింహగర్జన ఆదివారం జరిగింది. మహమ్మద్ మాట్లాడుతూ.. దామాషా ప్రకారం నూర్‌బాషాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల మంది ముస్లిముల్లో 20 లక్షల మంది నూర్‌బాషాలున్నారని తెలిపారు. ఏ పార్టీ అయితే తమకు ప్రాధానత్య ఇస్తుందో ఆ పార్టీకి తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు జానీబాషా మాట్లాడుతూ.. తమ జాతికి ఎవరు మద్దతిస్తారో వారే తమకు ఆత్మీయులన్నారు. రాష్ట్ర నూర్‌బాషా మహిళా అధ్యక్షులు బి.మస్తానమ్మ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఒక్క ఎమ్మెల్యే గాని, ఎమ్మెల్సీ కానీ తమ వారిలో లేరన్నారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగూర్ మీరా మాట్లాడుతూ.. తమ జాతి రాజకీయంగా అణగదొక్కబడుతోందన్నారు. సదస్సులో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు జాన్ సైదా, సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ మహమద్ ఖాజావలి, నగర అధ్యక్షులు షేక్ ఆదాం షఫీ, వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ స్టార్ మస్తాన్ పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు... ఇంకొన్ని దారి మళ్లింపు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విజయనగరం జిల్లా రైలు ప్రమాదం నేపథ్యంలో వాల్తేరు రైల్వే పరిధిలో పలు రైళ్లు రద్దు, ఇంకొన్ని దారి మళ్లింపు చర్యలను రైల్వే శాఖ చేపట్టింది. ఆదివారం రాత్రి 11.15 గంటలకు రైల్వే శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం... రాయపూర్-విశాఖపట్నం పాసింజర్ (08527) ఈ నెల 30న రాయపూర్‌లో బయల్దేరాల్సి ఉండగా రైలు రద్దయ్యింది. విశాఖ నుంచి రాయపూర్ పాసింజర్ (08528)ను కూడా రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

టిట్లాగర్-రాయపూర్-నాగ్‌పూర్-విజయవాడ రెగ్యులర్‌గా తిరిగే రైలును, బారుని-కోయంబత్తూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (03357) రైలును, రైలు నెంబరు (18189) టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ 29న తిరగాల్సిన రైలును దారి మళ్లించారు. ట్రైన్ నెంబరు 11020 భువనేశ్వర్ - సిఎస్‌టి ముంబయి-కోణార్క్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్‌లో 29న బయల్దేరాల్సి ఉంది. దాన్నీ దారి మళ్లించారు. రైలు నెంబరు 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ హౌరాలో 29న బయల్దేరాల్సి ఉంది. దాన్నీ దారి మళ్లించారు. రైలు నెంబరు 12245 హౌరా-బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ 29న హౌరాలో బయలుదేరాల్సి ఉంది. దాన్నీ దారి మళ్లించారు.

రైళ్ల షార్ట్ టెర్మినేషన్ : రైలు నెంబరు 20809 సంబల్‌పూర్-నాందేడ్ రైలు సంబల్‌పూర్‌లో 29న బయల్దేరింది. దీన్ని విజయనగరంలో ఆపేశారు. విజయనగరం-సంబలపూర్‌కు దీన్ని నడుపుతారు. రైలు నెంబరు 17479 పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పూరీలో ఈ నెల 29న బాలుగాన్‌లో నిలుపుదల చేశారు. పూరికి ఇది రావాల్సి ఉంది. విశాఖపట్నం- విజయనగరం ట్రైన్ విశాఖలో ఆదివారం బయదేరాల్సి ఉండగా దాన్ని పెందుర్తిలో ఆపేశారు. రైలు నెంబరు 11020 సిఎస్‌టి ముంబయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సిఎస్‌టి ముంబయిలో 28న బయలుదేరింది. దీన్ని విశాఖపట్నంలో నిలిపివేశారు.

కళ్లకు గంతలతో టిడిపి నిరసన

నిరసన తెలుపుతున్న బ్రాహ్మణి, లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ నాయకులు ఆదివారం కళ్లకు గంతలతో నిరసన చేపట్టారు. 'జగనాసురుడి కళ్లు తెరిపిద్దాం' పేరుతో సాయంత్రం 7గంటల నుంచి ఐదు నిమిషాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హైదరాబాద్‌లోని తన నివాసంలో భార్య బ్రాహ్మణితో కలిసి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. 'నిజం గెలవాలి' అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్కా ఆనంద్‌బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.ప్రసాద్, నాయకులు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్‌లో ఉంచారని చెప్పారు. అరెస్టు చేసి 51 రోజులైనా, అవినీతి జరిగిందని నిరూపించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులకు సంబంధించి ఐదేళ్లుగా కోర్టుకు వెళ్లకపోవడం, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డి అరెస్టు కాకపోవడం వంటివి వ్యవస్థలను మేనేజ్ చేయడమేనని పేర్కొన్నారు. ఆ పార్టీ ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ ఢిల్లీలోని తన నివాసం వద్ద, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్ హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు.

ఒపిఎస్ అమలు చేయాలి

ధర్నాలో ఎపిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఎపిటిఎఫ్ అధ్యక్షులు జి హృదయరాజు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సర్వీసుపరమైన సమస్యలు, విద్యారంగ సమస్యలతోపాటు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోజువారీ బోధనేతర కార్యక్రమాలు, వివిధ యాప్స్ అప్‌లోడింగ్‌ల వల్ల బోధనా సమయం సరిపోవడం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పర్యవేక్షణ పేరుతో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను, అధికారులను దూషిస్తుండటం, సస్పెండ్ చేయడం తీవ్రంగా బాధిస్తోందని అన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జివో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం వల్ల పాఠశాల విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇసుక తవ్వకాల్లో అక్రమాలు

సిబిఐ, సివిసిలకు టిడిపి ఎంపిల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని టిడిపి ఎంపిలు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ), కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి)లకు ఎంపిలు కనకమేడల రవీంద్ర, కె రామ్మోహన్ నాయుడు విడివిడిగా ఆదివారం లేఖలు రాశారు. రాష్ట్రప్రభుత్వం నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దల బినామీలకే టెండర్లు ఇస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు జెపి వెంచర్స్ పేరుతో చేతిరాత బిల్లులతో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన రెండు కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా అమ్మారని, ప్రీబిడ్ సమావేశాన్ని కూడా రహస్యంగా కోల్‌కతాలో నిర్వహించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక కుంభకోణంపై విచారణ జరిపించాలని, దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక టెండర్ ఎందుకు పొడిగించారు : పట్టాభి

సోమవారంతో ముగియనున్న ఇసుక టెండర్ దాఖలు గడువు తేదీని నవంబర్ 6వ తేదీ వరకూ ఎందుకు పొడిగించారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ టెండర్లలో కొత్తగా స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్‌పివి) ఏర్పాటుకు అనుమతిస్తూ కొత్త నిబంధనను ఎందుకు తెరపైకి తెచ్చారో గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా నచ్చిన శాండ్ మాఫియా డాన్లకు ఇసుక రీచ్‌లు అప్పగించాలన్న కుట్రతోనే ఈ నిబంధన తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక అంశాల్లో ఎలాంటి లొసుగులు, తప్పులు లేకపోతే అప్పులు, ఆదాయ వివరాలు ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని టిడిపి అధికార ప్రతినిధి జివి రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాలకు సంబంధించిన వాస్తవ సమాచారంతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సంక్రాంతి నుంచి అందరికీ కందిపప్పు

- నవంబరు నుంచి సరఫరాకు కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో కొన్ని నెలలుగా రేషన్ కందిపప్పు పంపిణీ లేకపోవడం పట్ల ప్రభుత్వం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దసరా పండుగ సమయంలో కూడా ఒకటి రెండు జిల్లాల్లోనే కందిపప్పు ప్రభుత్వం పంపిణీ చేసింది. మిగిలిన జిల్లాల్లోని రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయకుండా ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. రానున్నది ఎన్నికల సీజన్ కావడం, వరుసగా పండుగలు వస్తుండటంతో నవంబరు నుంచి కందిపప్పు పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది.

ప్రజా సమస్యలే అజెండా

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో సాగుతుందని తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోని నుండి ప్రారంభమయ్యే ఈ జాతాను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ థావలే సోమవారం ప్రారంభిస్తారు. రాష్ట్రంలో జూలైలోనే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా వుంటాయని హెచ్చరికలు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కరువును అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. పొరుగున వున్న కర్ణాటక ప్రభుత్వం కరువును ప్రకటించడంతోపాటు కేంద్ర బృందాలను రప్పించి నివేదికలను కూడా తయారుచేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా కరువు మండలాలను కూడా ప్రకటించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. వర్షాధారిత పంటలే కాదు ప్రాజెక్టుల కింద వున్న పంటలు ఎండిపోయాయని తెలిపారు బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆయకట్టు సాగు అంతా ఎండిపోయిందన్నారు. కృష్ణా నది కిందే కాదు గోదావరి నది కింద కూడా ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తీవ్రమైన కరువు నేపథ్యంలో రానున్న రోజుల్లో ధరలు పెరగకుండా ప్రజలకు ఆహారభద్రత కల్పించేందుకు రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంటరుణాలను పూర్తిగా రద్దుచేసి కరువు రైతులకు ఉపశమనం కల్పించాలన్నారు.

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పార్వతీపురం మన్యంజిల్లా సీతంపేటలో మరోజాతాను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రచారజాతాలో శ్రీనివాసరావుతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు, సురేంద్ర, సుబ్బరావమ్మ వుంటారని పేర్కొన్నారు. ఈ యాత్ర ప్రధానంగా పోలవరం నిర్వాసితులు, గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలపై సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 1/70, 5వ షెడ్యూల్‌లను తుంగలోతొక్కి పోడు భూములను గిరిజనుల నుండి బలవంతంగా లాక్కుంటోందని విమర్శించారు. భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో రెండు లక్షల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పోలవరం పునరావాసం విషయంలో రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై నెపం నెట్టి తప్పించుకోవాలనుకోవడం సరైంది కాదన్నారు. కేంద్రంపై ఒత్తిడిని తెచ్చి తక్షణం పోలవరం నిర్వాసితులకు పునరావాస చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

మరో ప్రచారజాతా శ్రీకాకుళం జిల్లాలోని మందసలో ప్రారంభమై కోస్తా జిల్లాలు, పారిశ్రామిక కారిడార్ గుండా సాగుతుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, లోకనాథం ఆధ్వర్యంలో కొనసాగే ఈ జాతాను పార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు విజు కృష్ణన్ ప్రారంభిస్తారని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు, అసంఘటితరంగ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని తదితర సమస్యలతో ఈ ప్రచారజాతా సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపిఎస్ అమలుచేసే అంశంలో, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే అంశంలో, అసంఘటితరంగ కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాన్ని అమలు చేసే అంశాల్లో మాట తప్పిందన్నారు. ఈ ప్రచార జాతాలన్నీ విజయవాడకు 8, 9, 10 తేదీల్లో చేరుకుంటాయని తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు రామచంద్రరావుకు అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరల్డ్ ఫొటో జర్నలిజం డే (నవంబరు 1) సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈనెల 24న నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో 'ప్రజాశక్తి' ఫొటో జర్నలిస్టు ఎ.రామచంద్రరావుకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపిసి), ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా (పిఎఐ) సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో 'జ్ఞానపీఠ్ డాక్టర్ రావూరి భరద్వాజ' మెమోరియల్ అవార్డును ఎ.రామచంద్రరావుకు ప్రకటించారు. నవంబరు 1న విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగే వరల్డ్ ఫొటో జర్నలిస్ట్ డే వేడుకల్లో అవార్డును అందజేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మిర్యాలగూడతో పాటు.. వైరా కూడా..

- లేకపోతే విడిగానే పోటీ :తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ చెప్పినట్టుగానే మిర్యాలగూడతో పాటు వైరా అసెంబ్లీ సీట్లను సిపిఎంకు కేటాయించకపోతే లౌకిక శక్తులను కలుపుకొని విడిగా పోటీ చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. రెండురోజుల్లో ఏ నిర్ణయమైంది తెలపకపోతే తమ పార్టీ అధినాయకత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని, ఒకసారి నిర్ణయం తీసుకున్నాక వెనక్కు వచ్చేది ఉండదని స్పష్టంచేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. లౌకికశక్తుల ఐక్యత కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌ఠాక్రే ప్రతిపాదన పెట్టారని, ఆ ప్రకారం తాము ముందుకు వెళ్తుంటే కాంగ్రెస్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికీ పది సార్లు ఎన్నికలు జరిగితే దానిలో ఎనిమిది సార్లు భద్రాచలం స్థానాన్ని సిపిఎం దక్కించుకుందన్నారు. అయినప్పటికీ ఆ స్థానాన్ని త్యాగం చేస్తున్నామని తెలిపారు. మిర్యాలగూడ, భద్రాచలం, పాలేరు, మధిర, ఇబ్రహీంపట్నం స్థానాలను తమ పార్టీ కోరిందన్నారు. ఈ స్థానాలు కాంగ్రెస్‌తో పొత్తు కోసమో.. లేక ఇతర పార్టీలతో పొత్తుకోసమో ఎంపిక చేసినవి కాదని, తమకున్న బలం దృష్ట్యా వీటిని ఎంచుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వం మొదటి నుంచి ఒక మాట స్పష్టం చేస్తూ వచ్చిందన్నారు. భద్రాచలం తమ సిట్టింగ్ స్థానమని, అక్కడి ఎమ్మెల్యే నిబద్ధతతోని పార్టీకి కట్టుబడి ఉన్నారని చెప్పడంతో దాన్ని గౌరవించామని చెప్పారు. త్రిపురలో కాంగ్రెస్ అధ్యక్షులు తమ పార్టీ సిట్టింగ్ సీటును కోరితే ఇచ్చిన ఉదంతాన్ని కూడా ప్రస్తావించామన్నారు. అయినా సరే వారు పట్టుబట్టడంతో భద్రాచలం స్థానాన్ని వదిలేశామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్కస్థానమైనా ఇవ్వాల్సిందిగా కోరుతూ పాలేరు సీటు అడిగామన్నారు. ఒక దశలో వారు ఇచ్చేందుకు సముఖత వ్యక్తం చేసినా.. ఆ తర్వాత మీడియాలో లీక్‌లు, రకరకాల వార్తలు వచ్చాయన్నారు. "తమ్మినేని వీరభద్రం పట్టుదలతోనే చర్చలు ఆలస్యమవుతున్నాయి" అంటూ ఓ పత్రిక రాసిందన్నారు. తాజాగా మరో పత్రిక మిర్యాలగూడ, వైరా రెండుస్థానాలు ఇస్తామంటే కూడా వైరాను కాదని పాలేరు కోసమే సిపిఎం పట్టుబడుతుందని రాసిందని తెలిపారు. ఇవేవీ వాస్తవాలు కాదని వివరించారు. 27వ తేదీ ఉదయం పాలేరు సీటు ఇవ్వడం కుదరదని చెప్పి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రకటించిందన్నారు. అదేరోజు సాయంత్రం తమ పార్టీ కార్యదర్శివర్గ సమావేశం జరిగిందని తెలిపారు. దానిలో వైరా సీటును అంగీకరిద్దామనే నిర్ణయం జరిగిందని చెప్పారు. ఆ ప్రకారం మిర్యాలగూడ, వైరా సీట్లను తీసుకోవడానికి సిద్ధమయ్యాయమని వివరించారు.

బెట్టకు వచ్చిన వరి

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీకి విడుదల చేయడం లేదు. వర్షాభావం తీవ్రంగా ఉండడం వల్ల డెల్టాలో ఈ ఏడాది రబీ సాగుపైనా నీలినీడలు నెలకొంటున్నాయి. ఏ పంటలు వేయాలన్న అంశంపై రైతుల్లో అయోమయం నెలకొంది.

పంటను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం : మంత్రి అంబటి

వర్షాలు లేకపోవడం వల్ల కాలువలకు ఎంత నీరు ఇచ్చినా సరిపోవడం లేదని, వేసవి కాలంగా వాతావరణం ఉండడంతో నీరు పెడుతున్నా వరి పంట బెట్టకు వస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి వచ్చిన నీటిని వచ్చినట్టు కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు విడుదల చేస్తున్నామని తెలిపారు.

ప్రస్తుతం డెల్టాలో సాగులో ఉన్న వరిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని 'ప్రజాశక్తి ప్రతినిధి'కి తెలిపారు. ఆయకట్టు చివరి భూములకు నీరు అందని పరిస్థితి ఉందని, కానీ మొత్తం డెల్టాలో పంటను కాపాడేందుకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి చూడాలని ఆదేశించామని తెలిపారు.

ఆశ్రిత పెట్టుబడి ప్రజాస్వామ్యానికి ముప్పు

- రాఘవాచారి స్మారకోపన్యాసంలో సీనియర్ పాత్రికేయులు పరంజయ్ గుహ ఠాకుర్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, విజయవాడ అర్బన్



కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని సీనియర్ పాత్రికేయులు పరాంజయ్ గుహ ఠాకుర్తా అన్నారు. రాఘువాచారి నాల్గవ వర్ధంతి కార్యక్రమం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. రాఘువాచారి ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' అనే అంశంపై పరాంజయ్ స్మారకోపన్యాసం చేశారు. పెట్టుబడిదారీ విధానంలో ఆస్తి వ్యక్తిగతంగా ఉండటంతోపాటు పెట్టుబడిదారుల మధ్య పోటీ లక్ష్యంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పెట్టుబడిలో పోటీ ఉండదని తెలిపారు. స్కాట్‌లాండ్, వియత్నాం, క్యూబా వంటి దేశాల్లో మౌలిక వసతులను ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. దేశంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటుచేశారని తెలిపారు. 40 శాతం నౌకాశ్రయాలు గౌతమ్ అదానీ చేతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆశ్రిత పెట్టుబడిదారులు ఎదగటానికి రాజకీయ అంశాలు కారణమవుతాయని తెలిపారు. జివికె సంస్థపై ఇడితో దాడులు చేయించి ముంబయి ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించారని విమర్శించారు. రాష్ట్రంలోని గంగవరం, కృష్ణపట్నం పోర్టులను కూడా అదానీ స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రసార మాధ్యమాల ప్రతినిధులు, ఉద్యమకారులపై కేసులు పెడుతున్నారని తెలిపారు. నిజాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా విస్తరించినా అందులో అవాస్తవాలు ఎక్కువగా ప్రచారమవుతున్నాయని చెప్పారు. వాస్తవాల్ని స్వేచ్ఛగా రాసే జర్నలిస్టులు రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యూస్‌క్లిక్ ఛానల్‌పై దాడిచేయటం ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వి రామారావు మాట్లాడుతూ గోడీ మీడియా పెరగడంతో ప్రధాన స్రవంతి మీడియా ప్రాధాన్యం తగ్గిందని చెప్పారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తిగా నరేందర్ ప్రమాణ స్వీకారం

- హాజరు కానున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నరేందర్ ఈనెల 30న రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. సాయంత్రం 4.47 గంటల కు తాడేపల్లి నుంచి బయలుదేరి రాజ్‌భవన్‌కు వెళ్తారని, కార్యక్రమం అనంతరం నివాసానికి చేరుకుంటారని సిఎం కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

పోరాటాలే మార్గం

సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చిత్రంలో సిహెచ్ నర్సింగరావు, ఎంవిఎస్ శర్మ తదితరులు

- కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ సర్కారు
- బిజెపితో అంటకాగే పార్టీలను ఓడించాలి
- 'స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల రక్షణ' రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పోరాటాలతోనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలు నిలబడతాయని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి, అదానీని ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానంలో నిలబెట్టడమనే సింగిల్ అజెండాతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ విషయమై ప్రజలను చైతన్యవంతం చేసి కార్మికవర్గం పోరాటాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు విశాఖలోని డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ముఖ్య అతిథి రాష్ట్ర మాజీ మంత్రి, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. ప్రజలు చెల్లించిన పన్నులు, లక్షల మంది శ్రమజీవుల కష్టంతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు బిజెపి పాలనలో తీవ్ర ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను 'అమ్మేస్తాం...మూసేస్తాం' అంటూ బరితెగించి వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్లాంట్ ఏమన్నా మోడీ తాత సొమ్మా అంటూ ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోలేకపోతే ముందుముందు పోర్టు, షిప్‌యార్డులను అదానీకి అప్పగించేస్తారని అన్నారు. ప్రయివేటీకరణకు ప్రజా ఆమోదం లేదన్న సంగతి మోడీ గుర్తించాలన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపితో లంకె పెట్టుకున్న రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీనైనా ప్రజలు ఓడించాలని, లేదంటే ప్రభుత్వ రంగం ధ్వంసమవుతుందని తెలిపారు. 283 ప్రభుత్వ రంగసంస్థలను అమ్మేసే కుట్రలకు బిజెపి తెగబడిందన్నారు. అదానీని పెద్దోడిని చేసిన ఘనత మోడీకే దక్కుతుందని విమర్శించారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ కెఎస్ చలం మాట్లాడుతూ వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలతో ప్రభుత్వ రంగ సంస్థలు నిలబడ్డాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలంటేనే ప్రజల ఆర్థిక సంస్థలని నాటి ప్రధాని నెహ్రూ అన్న మాటలను గుర్తుచేశారు. ప్రజల నుంచి వచ్చిన డబ్బుతోనే ఆ సంస్థలను నాడు ఏర్పాటు చేశారన్నారు.

దేశాభివృద్ధిలో అవి కీలకపాత్ర పోషించాయన్నారు. బిజెపి అధికారం చేపట్టిన తరువాత కార్మికుల సంఖ్య ఎలా తగ్గుముఖం పట్టిందో వివరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ డిసిఐ, బిహెచ్‌పివి, షిప్‌యార్డులను కాపాడుకున్న చరిత్ర విశాఖ కార్మికవర్గానికి ఉందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 990 రోజులుగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారని, కచ్చితంగా విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి, విశాఖకు ఇంత ద్రోహం చేస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మౌనం దాల్చడం తగదన్నారు. ఆ పార్టీలు రాజకీయాలు తప్ప ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ప్రజా సమస్యలను అజెండాగా చేసేందుకు నవంబర్ 15న సిపిఎం ఆధ్వర్యాన విజయవాడలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు. ప్రజల ముంగిటకు కార్మికులు వెళ్లి సరళీకరణ విధానాలు విద్య, వైద్య రంగాలను దెబ్బతీస్తున్న వైనాన్ని చెప్పి వారిని పోరాటాలకు సన్నద్ధం చేయాలన్నారు. రాబోయే ఆరు నెలల కాలంలో దీన్నే అజెండాగా చేయాలని పిలుపునిచ్చారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ బాలాజీ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వాల తోడ్పాటు లేదన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి కుమార్, కెఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న రమాదేవి తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బాధితురాలిని పరామర్శించిన రమాదేవి

ప్రజాశక్తి-అవనిగడ్డ (కృష్ణా)

కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో ఎస్‌టి బాలిక, మహిళలపైనా దాడిచేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలను ఆదివారం ఆమె పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దొంగతనం పేరుతో రాజా, అతని చెల్లెలు రాధిక, ఎస్సై, కానిస్టేబుల్ అతి దారుణంగా హింసించారన్నారు. దాడి చేసిన వారికి బెయిల్ రావడం చూస్తే కేసును నీరు గార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, బాధితురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బసవపూర్ణ జ్యోతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనం కాదు... ప్రజా వచనం కావాలి

- వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభలో వక్తలు
- 'సమతా స్వాప్నికుడు వేమన' పుస్తకావిష్కరణ

వేమన విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి- తిరుపతి

'ప్రవచనాలు చెప్పేవారు చాలామంది ఉన్నారు. అయితే, నేటి సమాజానికి ప్రజా వచనం చేప్పేవారు కావాలి. కాలాని కంటే ముందు నడిచిన వ్యక్తి. కాలంతోపాటు నడిచిన వ్యక్తి విశ్వకవి వేమన. వేమన పద్యం వేగుచుక్క లెక్కన ఇప్పటికీ అందరినీ ప్రశ్నించేలా చేస్తుంది. అయితే, ప్రశ్నించాలంటే ధైర్యం కావాలి. వేమన విజ్ఞాన కేంద్రం ఆ ధైర్యాన్ని నింపే కేంద్రంగా ఉండాలి' అని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి యశోదా నగర్‌లో వేమన విజ్ఞాన కేంద్ర భవనాన్ని ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఆదివారం ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు నేత పలవలి రామకృష్ణారెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన సభా మందిరాన్ని రామకృష్ణారెడ్డి కుమార్తె, మాజీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కుసుమకుమారి, ప్రముఖ అనువాదకులు ఎజి యతిరాజులు పేరుతో నిర్మించిన సభా మందిరాన్ని ఆయన భార్య ఎజి చంద్రమ్మ ప్రారంభించారు. అంతకుముందు టిటిడి పరిపాలనా భవనం నుంచి పెద్ద ఎత్తున వందలాది మంది విద్యార్థులు, విద్యా సాహితీవేత్తలతో 'వేమన పద్యానికి పట్టాభిషేకం' పేరుతో వేమన విజ్ఞాన కేంద్రం వరకూ పద్యాలను పాడుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విజ్ఞాన కేంద్రంలో వేమన పద్యభావన చిత్రలేఖన ప్రదర్శన ఆలోచింపజేసేలా ఉంది. 'ఒక సూర్యబింబం.. ఒక దీపస్తంభం.. ఒక జ్ఞానసంద్రం.. ఒక ధైర్య శిఖరం' అంటూ తిరుపతి బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన వేమన పద్య నృత్యరూపకం ఆహూతులను అలరించింది. సభకు తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజంలో హేతుబద్ధ ప్రశ్నను నేర్పించిన కవి వేమన అని కొనియాడారు. దర్శనికంగా, వాస్తవికంగా, పరిశోధనాత్మకంగా తన పద్యాలతో సామాన్యునికి పట్టం కట్టిన విశ్వకవి వేమన అని పేర్కొన్నారు. పిరికితనం, మురికితనం పోవాలని, మానవతా దృష్టి పెరగాలని, ప్రస్తుతం సమాజానికి కావాల్సింది ప్రజావచనమని అన్నారు. ఆధునిక కవిత్రయమంటే వేమన, గురజాడ, శ్రీశ్రీలేనని ఉద్ఘాటించారు. హేతుశీలత, మానవీయత, సామాజిక న్యాయం, ధిక్కారతత్వం, శ్రమ గౌరవం, ప్రతిఘటనల ప్రతిబింబం వేమన పద్యమని వివరించారు. అందుకే ఆయన జనప్రియుడని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ వేమన పద్యాలను సిపి బ్రౌన్ పరిశోధించి, పరిశీలించి, అనువదించి వెలుగులోకి తీసుకురాకుంటే, బహుశా వేమన గొప్పతనం తెలిసుండేది కాదన్నారు. కుసుమకుమారి మాట్లాడుతూ భౌతికవాద దృక్పథాన్ని సమాజానికి అందించిన గొప్ప కవి వేమనని, తన తండ్రి పలవలికి ఎంతో ఇష్టమైన కవి అని తెలిపారు. త్వరలో కేంద్రంలో ఏర్పాటు కానున్న గ్రంథాలయానికి తన కుటుంబం తరపున రూ.50 వేలను విరాళంగా ప్రకటించారు. అనువాద రచయిత ఎజి యతిరాజులు కుమారుడు ఎజి అరవింద్ మాట్లాడుతూ కులం, మతం, జాతుల పేరుతో విడిపోయి బలహీనపడుతున్న ప్రస్తుత తరుణంలో వేమన రచనలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి పి.మధు, సీనియర్ నటులు కాకరాల, రాయలసీమ సాహితీవేత్త భూమన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు కెవి చౌదరి, రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి, కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత పల్లెపట్టు నాగరాజు, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి కేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - యంత్రాంగం

నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని మద్దూరుపాడు వద్ద ఈ నెల 26న ఆర్‌టిసి డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధిం చిన వివరాలను నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 26న విజయవాడ ఆటోనగర్ ఆర్‌టిసి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు బెంగళూరు నుంచి విజయవాడకు వస్తున్న క్రమంలో నెల్లూరు జిల్లా కావలి వద్ద టిటిడి కల్యాణ మండపం వద్ద అడ్డుగా ఉన్న కారును తొలగించాలని బస్సు డ్రైవర్ హారన్ కొట్టారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కారులోని వారు డ్రైవర్‌తో ఘర్షణ పడ్డారు. ప్రయాణికులు, స్థానికులు అడ్డుకోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. బస్సును వెంబడించి కావలి జాతీయ రహదారి, మద్దురుపాడు సర్వీసు రోడ్డు దాటిన తర్వాత బస్సును అడ్డగించారు. డ్రైవరు బొందిలి రామ్‌సింగ్, సహచర ఆర్‌టిసి డ్రైవరు టి. శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. తుమ్మలపెంట రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వెళ్తున్న నంబరు ప్లేటు లేని కారును పోలీసులు తనిఖీ చేయగా అందులో ఉన్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో బండి విల్సన్, పుట్టా శివకుమార్‌రెడ్డి, షేక్ ఖాజావల్లి, కుప్పాల వంశీ, షేక్ కలీమ్, షేక్ ఇలియాజర్, షస్త్రక్ బాజీ ఉన్నారు. బండి విల్సన్, పుట్టా శివకుమార్‌రెడ్డి ఇది వరకూ నేరచరిత్ర కలిగిన వారని, హత్యాయత్నం కేసుగా నమోదు చేశామని, కోర్టులో విచారణ వేగవంతంగా పూర్తి చేసి నాలుగు నెలల్లోగా నిందితులకు శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పి తెలిపారు.

పలు జిల్లాల్లో నిరసనలు

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ పలు జిల్లాల్లో ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు ఆధ్వరంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింహాచలం ఆర్‌టిసి డిపో వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌టిసి సిబ్బందికి రక్షణ కల్పించాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, పొదిలి, కనిగిరి, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆర్‌టిసి డిపోల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాతగుంటూరులో సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. తెనాలి, పల్నాడు జిల్లా వినుకొండ, సత్తెనపల్లిలో నిరసన తెలిపారు. డ్రైవర్‌పై దాడులకు సిఎం, డిజిపి సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.

2 నుంచి కరువు జిల్లాల పర్యటన : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నవంబర్ 2వ తేదీ నుంచి సిపిఐ రాష్ట్ర సమితి నాయకత్వంలో 18 కరువు జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు, కరువు తీవ్రతపై పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల్లో చర్చించినట్లు చెప్పారు. కృష్ణా జిలాల పునఃపంపిణీపై నవంబర్ ఒకటవ తేదీన విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొందని, ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని చెప్పారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కరువుపై నోరు మెదపడంలేదన్నారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నవంబర్ 8వ తేదీన విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. అన్ని రకాల సంక్షేమ పెన్షన్లను రూ.6 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లిక్కర్ అమ్మకాలు, విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ కొనుగోలులో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. సామాజిక బస్సు యాత్ర పేరుతో వైసిపి మరో మోసానికి తెరతీసిందన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగు లకు రూ.7 వేలు పెన్షన్ ఇవ్వాలని నవంబర్ 10న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

రామకృష్ణతో రఘువీరారెడ్డి బేటీ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం విజయవాడలో బేటీ అయ్యారు. ఇండియా కూటమి పటిష్టతపై చర్చించారు.

వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వాలి

- అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక ఉండాలి
- అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.లక్ష కోట్ల నిధులను కేంద్రం కేటాయించాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. 'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై అనంతపురం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రేడియెంట్ ఫంక్షన్ హాలులో సదస్సు నిర్వహించారు. 'వ్యవసాయం-నీటిపారుదల, పరిశ్రమలు- ఉపాధి, సామాజిక తరగతులు- అభివృద్ధి ఆటంకాలు, విద్యా-వైద్యం' అంశాలపై సదస్సు జరిగింది. ఒక్కో అంశానికి సంబంధించి ఆయా రంగంల్లో అనుభవమున్న వారు ప్రసంగించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రారంభోపన్యాసం చేశారు. అభివృద్ధి అన్న పదానికి ప్రభుత్వాలు అర్థాలనే మార్చేస్తున్నాయని విమర్శించారు. తలసరి ఆదాయన్ని చూపించి అదే అభివృద్ధి అని చెబుతున్నాయన్నారు. ఆ రకమైన ఆర్థికాభివృద్ధి చూసినప్పుడు అది ధనవంతులు, పెట్టుబడిదారుల అభివృద్ధిగానే ఉంటోందని వివరించారు. ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి జరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూసినప్పుడు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక 77వ స్థానంలో ఉండగా భారతదేశం 133వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రాభివృద్ధి మరింత కుంటుపడిందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాలకు లక్ష కోట్ల రూపాయల ప్యాకేజీని వ్వాలని డిమాండ్ చేశారు. సాగునీటి రంగంపై మావన హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ.. అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటి వనరులను తీసుకురావడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విశ్లేషించారు. 1990 దశకం నుంచి వేరుశనగ పంట ప్రధాన పంటగా జిల్లాలో మారిందన్నారు. ఇప్పుడు పండ్ల తోటల సాగు గణనీయంగా పెరుగుతోందని వివరించారు. మారుతున్న పంటల సరళికి అనుగుణంగా తగిన ప్రోత్సహకాలు లేవన్నారు. పరిశ్రమలు- ఉపాధి అంశంపై ప్రొఫెసర్ బావయ్య మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. జిల్లా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. వీటి పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ముందుకు రావడం లేదన్నారు. సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు అన్న అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసరు క్యాస్ట్రో కిరణ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, దీన్ని అందిపుచ్చుకోవడానికి ఇతర రంగాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు కూడా ఐటి రంగంలో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పూర్తి స్థాయి సాంకేతిక అందిపుచ్చుకోకుండా అడుగు పెట్టడం ద్వారా కొన్ని ఇబ్బందులూ ఎదుర్కొనే పరిస్థితులుంటు న్నాయని తెలిపారు. సామాజిక తరగతులు- అభివృద్ధి- ఆటంకాలు అన్న అంశంపై ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ సత్యబోస్, భానుజాలు మాట్లాడారు. వైద్యరంగంపై డాక్టర్ ప్రసూన మాట్లాడారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించు చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్కు, గణ్‌పత్రావ్ కదం మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబయి 400013 సంప్రదించాల్సిన నెం.(022) 61827414, (002)

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు ది **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని,దిగువ చూపినట్లుగా తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరురూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు ఫైనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ద వహించవలసిందిగా కోరబడుచున్నది.

	రుణ ఖాతా సంఖ్య	బాధ్యులు/చట్టబద్ద వారసులు/ చట్టబద్ద ప్రతినిధుల పేరు	మొత్తం & డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది
1	TCHHF08 03000100 000448	శ్రీ బద్దెపూడి ఆంజనేయులు (రుణగ్రహీత) మరియు శ్రీమతి. బద్దెపూడి హనువాయమ్మ (సహ-రుణగ్రహీత)	రూ॥1,33,73,183/- (ఒక కోటి ముప్పై మూడు లక్షల డెబ్బై మూడా వేల ఒక వంద ఎనభై మూడా రూపాయలు మాత్రమే) మరియు 19.07.2023	26.అక్టోబర్. 2023

సెక్యూర్డ్ / స్థిరాస్తుల యొక్క వివరణ: ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రీ, చిలకలూరిపేట మున్సిపాలిటీ ఏరియా, చిలకలూరిపేట (గతంలో పసుమ్మరు గ్రామం వద్ద ప్రస్తుతం చిలకలూరిపేట మున్సిపాలిటీ లో ఉండేది) వద్ద ఉన్న డో నం.809/సి లో ఆర్‌సిసి భవనము మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ మరియు స్థలం కొలిచే 573.22 చ.గ.లు. శ్రీ బద్దెపూడి ఆంజనేయులు వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.2540/2019 యొక్క పేరు మీద ఉన్న తదుపరి సబ్-డివిజన్ డో నం.809/సి1, బ్లాక్ నం.35, బేరింగ్ డో నం.35-471 మరియు **హద్దులు: తూర్పు:** ఎన్‌హెచ్5 రోడ్డు మార్జిన్, **దక్షిణం:** కుంచల అన్నపూర్ణా కు చెందిన ఆస్తి, **పడమర:** కొమ్మినేని రెసిడెన్సీ యొక్క అపార్ట్‌మెంట్, **ఉత్తరం:** కోటప్పకొండ యొక్క రోడ్డు మార్జిన్.

ప్రదేశం: విజయవాడ,
తేది: 30 అక్టోబర్, 2023

సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డో.నం.1871ఎ24, విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు,పాలరివట్టొం కొచ్చిన్-682025, ఫోన్ : 7558865300

వేలం నోటీసు

31.10.2023న దిగువ పేర్కొన్న శాఖల క్రింద తనఖా వస్తువులను క్రమబద్ధమైన పద్ధతిలో వేలం వేయాలని కెఎల్‌ఎమ్ ఆక్సివ ఫైన్‌వెస్ట్ లిమిటెడ్ నిర్ణయించుకుంది, తిరిగి చెల్లింపు లేదా పునరుద్ధరణకు ఆసక్తిగల వినియోగదారులు వడ్డీతో వేలానికి ముందు సంబంధిత శాఖలలో సంప్రదించగలరు. అయితే, పైన పేర్కొన్న కారణాల వల్ల వేలం విఫలమైతే, ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా వేలం నిర్వహించే స్థలానికి వేలం వాయిదా వేయడానికి ఆపరేటర్లకు పూర్తి అధికారం ఉంటుంది. కెఎల్‌ఎమ్ ఆక్సివ ఫిన్‌వెస్ట్ లిమిటెడ్., విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు, పాలరివట్టోమ్. 2వ వేలం తేది మరియు సమయం: 02.11.2023, మ.02.00 గం. వేలం సెంటర్ : బొంబాయి హోసరీస్ అండ్ ఫ్యాషన్ బిల్డింగ్ ఒకటవ అంతస్తులో డో.నం.14-2-1, 2,3, స్టేడియం వద్ద, జి.టి.రోడ్డు, పోతూరి తోట, గుంటూరు-522001 (గుంటూరు జిల్లా) గుంటూరు లాలపేట
LALAPET 202204110100106 MACHAVARAM 202304160100175 MANGALAGIRI 202204290100071 202204290100127 202204290100136 202304290100140 202304290100145 202304290100189 202304290100242 REPALLE 202205050100088 202205050100126 202205050100202 202205050100206 202205050100273 202305050100156 202305050100157 202305050100158 202305050100159 202305050100161 202305050100171 202305050100172 202305050100201 202305050100251 202305050100271 202305050100274 202305050100275 202305050100279 202305050100280 202305050100288 202305050100316 202305050100317.

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డో.నం.1871ఎ24, విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు,పాలరివట్టొం కొచ్చిన్-682025, ఫోన్ : 7558865300

వేలం నోటీసు

31.10.2023న దిగువ పేర్కొన్న శాఖల క్రింద తనఖా వస్తువులను క్రమబద్ధమైన పద్ధతిలో వేలం వేయాలని కెఎల్‌ఎమ్ ఆక్సివ ఫైన్‌వెస్ట్ లిమిటెడ్ నిర్ణయించుకుంది, తిరిగి చెల్లింపు లేదా పునరుద్ధరణకు ఆసక్తిగల వినియోగదారులు వడ్డీతో వేలానికి ముందు సంబంధిత శాఖలలో సంప్రదించగలరు. అయితే, పైన పేర్కొన్న కారణాల వల్ల వేలం విఫలమైతే, ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా వేలం నిర్వహించే స్థలానికి వేలం వాయిదా వేయడానికి ఆపరేటర్లకు పూర్తి అధికారం ఉంటుంది. కెఎల్‌ఎమ్ ఆక్సివ ఫిన్‌వెస్ట్ లిమిటెడ్., విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు, పాలరివట్టోమ్. 2వ వేలం తేది మరియు సమయం: 02.11.2023, ఉ.10.00 గం. వేలం సెంటర్ : శ్రీ కృష్ణ నిలయం, ఒకటవ అంతస్తు, బ్యాంక్ ఆఫ్ బరోడ పైన, గవర్నర్‌పేట, ఏలూరు రోడ్డు, కృష్ణ-520002 (కృష్ణాజిల్లా) భవానీపురం, గవర్నర్‌పేట
BHAVANIPURAM 202203980100090 GOVERNORPET 202304020100106 KANKIPADU 202204100100275 202204100100296 202204100100303 202204100100329 202204100100331 202204100100335 202304100100159 202304100100229 202304100100345 MACHILIPATNAM 202204200100222 202204200100230 202204200100255 202204200100257 202204200100272 202204200100290 202204200100303 202204200100309 202204200100314 202204200100324 202304200100014 202304200100131 202304200100155 202304200100191 202304200100211 202304200100247 202304200100319 PORANKI 202303990100049 202303990100063 202303990100067 202303990100069 202303990100075 202303990100079 202303990100091 202303990100109 202303990100148 202303990100154 202303990100156 202303990100158 202303990100171 202303990100172 202303990100173 202303990100174 RAJUPETA 202204880100045 202204880100047 VUYYUR 202203850100186 202203850100205 202203850100225 202203850100231 202203850100264 202203850100294 202203850100298 202303850100251 202303850100275.

'కూలగొట్టుడు కులమత కుటిలతను
సమము చేయుడు మానవ సామ్యములను
పీడిత జనమ్ము న్యాయము వీడెనేని
మకర కుండలమ్ములు మిమ్ము మనుపగలవే'
- బోయి భీమన్న



నువ్వూ మిగిలిపోతావు

ఎంతకని వుంచుకుంటావు
ఇంకా ఇంకా ఎందాకని విస్తరిస్తావు
నువ్వేమైనా అడవివా, అల్లుకుపోవటానికి
మనిషివే కదా!

నీకెంత జాగా కావాలి?
ఆకాశాన్నీ భూమినీ ఆక్రమించినా
నీకు చివరికి మిగిలేది
ఆరడుగుల నేలే కదా!
ఆ విషయం ఎందుకు మరుస్తావు నువ్వు?

పసిమొగ్గల్ని, పచ్చనాకుల్ని
పూలవనాల్ని, పున్నమి వెన్నెలల్నీ
తెంపేసి నువ్వు బావుకునేదేముంది?

ఎవరి జాగా వాళ్లకివ్వకూడదా
ఎవరి బతుకును వాళ్లను
బతుకనివ్వకూడదా?
చంపేసుకుంటూ ఎంత దూరం పోతావు?
బాంబులు విసురుకుంటూ
బతుకుల్ని కూల్చుకుంటూ
మహా అయితే నువ్వేం సృష్టించగలవు
ఒట్టి శవాల దిబ్బలు తప్ప !

ఊళ్లకు ఊళ్లను శ్మశాన మైదానాల్లా మార్చి
నువ్వు పరిపాలించేదేముంటుందిక
పరిపాలించటానికి ప్రజలుండాలి కదా!
మనుషులు బతికుండే ఓ నేల కావాలి కదా
నువ్వూ మనిషివేనన్న సంగతి మరిచిపోతే ఎట్లా ?

బతుకుల్ని నేలమట్టం చేసుకుంటూ
పల్లెల్నీ, నగరాల్నీ, పచ్చని ఆవాసాల్నీ
మనుషులు సంచరించే ప్రతి మూలనీ
మట్టిదిబ్బల్లా మార్చుకుంటూ
యుద్ధం కాళ్లకింద
ఎంతకని తొక్కుకుంటూ వెళతావు?
ఎంతకని అంతా నాదేనని విర్రవీగుతావు
ఎందాకని రాజ్యదాహంతో విస్తరిస్తూ పోతావు
చివరికో కప్పెట్టిన మట్టిదిబ్బలానే
నువ్వూ మిగిలిపోతావని
ఎప్పటికి తెలుసుకోగలవు !

– చిత్తలూరి
91338 32246

నిలువు జీతాలు

బతికున్న బానిసత్వానికి
నిలువెత్తు గీతాలు
ఆకలి పాము కాటేసిన
బడుగు మధ్యతరగతి ఆడపిల్లలు
సూర్యుడు కదలకుండా నిలబడడు
చంద్రుడు ఒకేచోట స్థిరపడడు
పొద్దుట నుంచి రాత్రి వరకు
నేలలో పాతిన స్తంభాల్లా
కట్టుకొయ్యల్లా గంటల యుగాలు
పాతుకుపోవడం ఎంత నరకం!

కట్టు బానిసలు కూడా తప్పించుకుంటారు
చెరసాలలో ఖైదీలు పారిపోతారు
బతుకులు కాసిని రూపాయలకు
అమ్ముడుపోయినందుకు
మనుషులు భూమిలో దిగబడిన కట్టుకొయ్యలు

ఉద్యోగ నియామకంలో
ఒప్పందంలో భాగమా?
రోజూ ఉగ్గబట్టుకున్నా
ఆ మూడు రోజులూ
బండబారిన కాళ్ళతో
ఉద్యోగానికి స్వస్తి పలకాలనుకున్నప్పుడల్లా
నెత్తిమీద మొట్టికాయలు కొట్టే అవసరాలు
నచ్చినదాని కోసం కట్టల కట్టల చీరలన్నీ
విప్పి చూపే పిల్లలు
నీకు నప్పే రంగురంగుల గాజుల
ఇంద్రధనస్సులను చేతికి తొడిగే పిల్లలు
పాపం
లోపల కష్టాల కన్నీళ్ల చారలు బయటకు
కనబడకుండా
ముఖం మీద పాల వెన్నెల పౌడరద్ది
పెదవులపై చిరునవ్వుల విరజాజులు విరబూసే పిల్లలు
బట్టల షాపులను ఫాన్సీ షాపులను వెలిగించే
అమావాస్య చందమామలు
ఆకురాలు కాలంలో నేలపై రాలిన పువ్వులు!

– మందరపు హైమవతి
94410 62732

ఇటీవల ముందు .. అటీవల తరువాత ...

చెరువు మీద ఆకాశంలో నక్షత్రాలు వెలిసాయ్
మేఘాలు కమ్ముకున్న దట్టమైన రుతువులో
ముఖం మనిషికి చాటేసింది
బహిర్భూమిగా మిగిలిన జనారణ్యంలో
నిస్సహాయంగా ఒలికిన కన్నీరుకు
నీటి జీవాల మనసు నొచ్చుకుంది

దెయ్యాలతో రమించిన దోమల
గుడ్లు పిగులుతున్నాయ్
అందరూ దద్దుర్లను గోక్కుంటూనే
హంతకుల తల నిమురుతున్నారు
వలలో పడిన నక్షత్రాలను చూసి
'దొంగ.. దొంగ..' అని అరిచిన కావలివారు
కటకటాల మధ్య కాలాతీతులయ్యారు

రేపెప్పుడో పసుపూ కుంకుమా పంచుతారు
తుప్పట్టిన సుత్తులూ కొడవళ్లు పట్టుకుని
సైకిలెక్కి గిరగిరా కేంద్రానికొచ్చేయండి
మీక్కావల్సింది ఉత్తి పుణ్యానికొచ్చే పీఠమేగా?

తెల్లారడానికి ముందటి చీకట్లో
ఇటీవలి బాధితుడొకడు బుడుంగున దూకేశాడు
చెరువుపైని ఆకాశంలో నక్షత్రాలన్నీ విలవిలలాడాయి
అటీవల చిందిన నెత్తురంతా,
ఇటీవల తెల్లారబోయే ఉదయం కోసం
గొంతుక్కూచుంది!

– దేశరాజు



గడ్డ పెరుగు లాంటి కవిత్వం

సమీక్ష

పుస్తకాల్లో పత్రికల్లో పెరుగు రామకష్ణ గారి పేరు చూసినా, ఇంటిపేరు చూసినా, ఆయన గంభీరమైన నిలువెత్తు రూపం చూసినా, పండువెన్నెల లాంటి ఆయన మోము చూసినా, ఆ కళ్ళలోని స్ఫురద్రూపత్వం చూసినా, వివిధ సందర్భాల్లో తను స్పందించే తీరు చూసినా, తన కవిత్వంలోని చిక్కదనం చూసినా అమ్మ తోడు పెట్టి పేరబెట్టిన కమ్మని గడ్డ పెరుగు గుర్తొస్తుంది. కవిగా ప్రాంతీయం, జాతీయమైన ఎల్లలు దాటి అంతర్జాతీయంగా కూడా 'పొయెట్ లారియట్' గా సుప్రసిద్ధులైన ఆయనను పరిచయం చెయ్యక్కర్లేదు. కానీ, నేటి తరం కవుల కవిత్వంతో పోటీపడి వారి తాజా కవితా సంపుటి 'వర్ణలిపి' డా.మల్లవరపు రాజేశ్వరరావు స్మారక వార్షిక కవిత్వ పురస్కారాలు – 2023కు ఎంపికైన సందర్భంగా ఆ కమ్మని గడ్డ పెరుగులో వేలుపెట్టి రుచిచూడ్డం సందర్భోచితంగా ఉంటుంది.

వర్ణలిపి అనే పదబంధంలోనే గడుసుదనం ఉంది. అది అనేక విధాలుగా అర్థం చేసుకునేలా చేస్తుంది. ప్రపంచ భాషల్లో లిపి అనేది వర్ణ లిపి, అక్షర లిపి అని రెండు రకాలు. ఈ పదబంధాన్ని ఒక భాషాశాస్త్రవేత్త వింటే ఇది ఏదో భాషాశాస్త్ర సంబంధమైన రచన అని అనుకుంటారు. ఈ దేశంలో తెల్లని ఆర్యజాతి, నల్లని ద్రవిడ జాతి చరిత్ర స్పష్టంగా గుర్తు పట్టలేని ఆదిమ కాలంలోనే కలిసిపోయి అనేకమైన మిశ్రవర్ణ శూద్రజాతులు పుట్టుకురావడం వల్ల ఇక్కడ వర్ణం అనేది బాగా పాతబడిపోయింది. అది మనువు, మనువాదం చేసిన కుట్రల వల్ల కులంగా బలపడి చేవబారిపోయింది. అందువల్ల ఒక సామాజిక శాస్త్రవేత్తగాని, ఒక సాహితీవేత్త గాని ఈ పదబంధాన్ని వింటే ఇదేదో దేశంలోని సామాజికవర్గాల విశ్లేషణకు సంబంధించిన రచనగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. కానీ, ఈ పదబంధానికీ ఈ రెండు ఊహలకూ సంబంధం లేదు. అనాది నుండి అంతర్జాతీయంగా మనిషిని విడదీస్తున్నది అతని శరీరవర్ణం... మేనిరంగు. అలెక్స్ హేలీ రచన 'రూట్స్' లోని కుంటాకింటే నుండి ఇటీవల అమెరికాలోని తెల్లజాతి పోలీసు అధికారి బూటుకాలి కింద నలిగిపోయి అసువులు కోల్పోయిన జార్జి ఫ్లాయిడ్ వరకూ అది చేసిన దాష్టీకం అంతా ఇంతా కాదు. ఫ్లాయిడ్ ఉదంతంతో పెరుగు రామకృష్ణ నిలువునా కరిగిపోయి 'వర్ణలిపి' అనే వచన పద్యంగా బయటపడ్డారు. అలాగని ఇదేమీ అదే అంశంపై దీర్ఘకావ్యం కాదు. కానీ, ఈ శీర్షిక వల్ల ఈ కవి రంగూరుచీ తెలుస్తాయి. ఆయన సామాజిక దృక్పథం, సాహిత్య నేపథ్యం తెలిసొస్తాయి.

వర్ణలిపిలో రామకృష్ణ 30 పద్యాలతో స్వీయ కవిత్వం, 23 పద్యాలతో అనువాద కవిత్వం కలిపి తన వాదం, అనువాదం వినిపించారు. ఆయన మానవ సంబంధాలను సంఘటనా ముద్రలుగా గుర్తుంచుకుంటారు. వాటిని 'బుగ్గమీద అమ్మ పెట్టిన ముద్దు/ ఎప్పుడు బుగ్గ తుడుచుకున్నా అమృత మధురం' 'నువ్వు పలకరించిన చిరునవ్వు పూలు/ మనసువాడలో వాడనేలేదింకా' లాంటి వాక్యాలుగా అభివ్యక్తం చేసి పాఠకుణ్ణి తన జ్ఞాపకాలు తడుముకునేలా చేస్తారు. తన చెమటోడ్చి మనిషికి ప్రాథమిక అవసరమైన అన్నం పెట్టే రైతంటే ఆయనకు ఎనలేని ప్రేమ. 'సింహపురి రైతు' పత్రికలో ప్రముఖపాత్ర వహిస్తూ రైతు రుణాన్ని తీర్చుకుంటున్న కవి ఆయన. మూడు రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ఉత్తర భారతంలో అన్నదాతలు ఉద్యమిస్తున్నప్పుడు ఆయన 'విత్తును నాటి ప్రాణ ప్రతిష్ట చేసే/ పచ్చని సంజీవని చేతులు/ ఆ చేతులంటే నాకు ఎంతో ఇష్టం', 'తడినేల మీద గాయాల మొలకలెత్తక ముందే/ ఆ చేతులు గెలవాలి' అని కోరుకున్నారు. రైతుని పొలం పత్రంలో పంటల కవిత్వం పండించే కవిగా చూసే రామకృష్ణకి రైతన్నా, సేద్యం అన్నా అలవిమాలిన అభిమానం.

పెరుగు ఎప్పుడూ గడ్డకట్టి ఉంటుంది. కానీ, దానికి కరిగే గుణం ఎక్కువ. కవుల్లో కూడా పెరుగు రామకృష్ణ కూడా అంతే! సమకాలంలో జరుగుతున్న ప్రతి ఘటనకీ, ప్రతి ప్రతిఘటనకీ ఆయన కలం స్పందిస్తుంది. వాటితో ఆయన గళం మమేకమౌతుంది. ప్రపంచంలో ఒక వింత ధోరణి ఉంది. నల్లజాతి అణగారిన వర్గాల్ని తెల్లజాతి ఆధిపత్య వర్గాలు కావలిసినంత వాడుకుంటాయి. వాళ్ళ కష్టార్జితాన్ని కడుపునిండా మెక్కుతాయి. కానీ వాళ్ళ అస్తిత్వాన్ని ఒప్పుకోవు. అలాంటి సందర్భంలో నల్లజాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పే బాధ్యతని కవిగా రామకృష్ణ తీసుకుంటారు. "మనం చూసే కన్ను నలుపు/ మన చూపులెప్పుడూ తెలుపే/ నలుపు వినా తెలుపు విలువ సున్నా/ తెల్లని మేఘాలు నలుపెక్కితేనే గానీ/ నేల తల్లికి పురుడు సాధ్యం కాదు/ నల్లని రాత్రి తెల్లవారితే కాని సూర్యబింబానికి గగనాన చోటుండదు/ నలుపు – తెలుపుల మేలిమి సమ్మేళనం జీవితం" అని కళ్ళు తెరిపిస్తారు. ప్రపంచ అస్తిత్వానికి రెండు జాతుల అవసరాన్ని నొక్కి చెబుతారు.

రామకృష్ణ ప్రజల పక్షాన నిలబడే కవి. "చూపులతోనే ఐస్ క్రీం చప్పరిస్తుంది అనాథపిల్ల" అన్నప్పుడు, క్యాపిటలిస్టు సంస్కృతికి ప్రతినిధి ఐన ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నప్పుడు కూడా "నువ్వు రావాలంటే సముద్రం రోడ్డవ్వాలి/ చీకటి నవ్వుతూ ఆహ్వానించాలి" అన్నప్పుడు రామకృష్ణ ఎవరి పక్షాన ఉన్నాడో లోతుగా ఆలోచిస్తే తెలుస్తుంది. గతాన్ని అందులోని అమానవీయతల్ని తలచుకుని కన్నీరు పెడతారాయన. 'రహస్యముద్ర' కవితలో దేవదాసీ వ్యవస్థని సృష్టించి, వాడుకుని వదిలేసిన సమాజంపై సుతిమెత్తని చురకలేస్తారు. 'ఓ కలల వేకువ'లో "గతం విసరిన విషవాయువుల నుండి/ నూతన శ్వాస పీల్చుకోవడమే కదా ఉగాది" అంటారు. విశాఖ ఉక్కు విషయంలో తెలివిడి లేని ప్రభుత్వం "చెట్టు విరగకాచినప్పుడు అమ్ముకుని/ ఆకులు రాల్చినప్పుడు గొడ్డలి పట్టుకుని" నరికే న్యాయం పాటిస్తున్నదనీ విమర్శిస్తారు. ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే "తెలుగుగడ్డపై మళ్ళీ ఎగసిన చేతులు/ జనఘోషై మరోసారి ఉప్పెనగా మారుతుంటే/ కబోది పాలకులకు తపోభంగం కాక తప్పదు..!" అని హెచ్చరించారు.



ప్రపంచీకరణ అకృత్యాలను రామకృష్ణ కవిత్వం ఎండగడుతూ ఉంటుంది. ప్రపంచీకరణ లాభాల రూపంలో దోపిడీ చెయ్యడమే కాదు ప్రకృతిని కోలుకోలేని విధంగా ధ్వంసం చేస్తున్నది. దాని పుణ్యమా అని చెట్లు పోయి ఇనుపచెట్లు మొలుచుకొచ్చాయి. జీవ వైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. ఇప్పుడు "శూన్యం నిండా ఇనుపచెట్ల దర్శనం/ సాలెగూడులా నగరానికి అల్లుకున్న టవర్ల పైన/ క్రూరపు గద్దల కాపురం" అని వాపోతారు ఆయన. "మానవజాతి అభివృద్ధి కోసం/ జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తున్న విధ్వంసకారుడిలా/ ఆ బొమ్మ ముందు మోకరిల్లిన నేరస్తుణ్ణి నేను...!" అని మానవుడిగా తనపై నేరారోపణ చేసుకుని ముద్దాయిలా నిలబడే రామకృష్ణ ఎంత నిబద్ధత కలిగిన మనిషో అర్థమవుతుంది. బడా షాపింగ్ మాళ్ళు వచ్చి చిల్లరంగళ్ళు చతికలబడిపోతున్నాయి. "పేదోడి పొట్ట కొట్టి/ పెద్దోళ్ళకు దోచి పెట్టడమే/ ఇదో బహుళ రాజకీయం" "వ్యాపారం వాడిదే, దోపిడీ వాడిదే/ లూటీ చేయబడ్డ వాడే గరీబు/ సిరి వాళ్ళింటి ఆడపడుచు/ చిన్నకొట్టు వాడు మట్టి కొట్టుకుపోతున్నాడు" అని బహుళజాతి కంపెనీల గుట్టు రట్టు చేస్తారు. "మాల్‌ను చూస్తుంటే పూర్వపు పాలెగాళ్ళు గుర్తుకొస్తున్నారు/ చిల్లర రేటుకు కొనబడుతున్న చెమట గుర్తుకొస్తున్నది/ ఇప్పుడు మాల్ కన్ను పొలం పంటపై పడింది/ అమ్మో, దేశం అమ్మకానికి సిద్ధమౌతున్నట్టుంది..!" అని భవిష్యత్తు భయాలు చెప్పి జాగృతం చేస్తున్నారు. ప్రపంచీకరణ వల్ల మానవ సంబంధాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. "ఇప్పుడు రెండు హృదయాల మాట దేవుడెరుగు../ ఆ యింటి గాలి ఈ యింటికి/ ఈ యింటి గాలి ఆ యింటికి సోకరాదని" అన్నట్టు పరిస్థితి తయారైందని బాధపడతారు కవి.

రామకృష్ణ ప్రగతిశీల కవి. కరోనా కాలంలో బంధు మిత్రులు కనీస మానవత్వం కూడా మరిచిపోయి మొహం చాటేసినపుడు ముస్లిం సోదరులు ఎంతో సాహసించి ఎందరికో అంతిమ సంస్కారాలు చేశారు. వాళ్ళని సరిహద్దు సైనికులతో పోల్చి సలాం అంటారాయన. "ఓం అల్లానమస్సలామ్..!" పద్యంలో దేశంలో హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా ఉంటారని, రాజకీయాలే వాళ్ళని విడదీసి ఐక్యతని దెబ్బదీస్తుంటాయని బాధపడతారు. మానవులు అందరిలాగే రామకష్ణ గారికీ గతకాలం పట్ల అభిమానం ఉంది. 'ఒకనాటి ఎన్జీవో' పద్యంలో ఆయన ఆనాటి ఎన్జీవోలు ఎంత నిస్వార్థంగా పనిచేశారో గుర్తుచేసుకుని నిట్టూరుస్తారు. మే నెల అంటే మేడేతో ప్రారంభం అవుతుందని ఆయన గుండె సందడి చేస్తుంది. రామకృష్ణ హృదయమున్న కవి. అందుకే ఆయనలో యుద్ధవిముఖత ఉంది. 'యుద్ధచరిత్ర' పద్యంలో "సైనికుడా! ప్రపంచంలో యుద్ధం వొక్కటే/ పరిష్కారం కాదని నీ ఆత్మకు తెలుసు/ తెలిసే చేస్తున్న తప్పుకు/ యుద్ధవిరమణే ప్రాయశ్చిత్తం కాదు/ రక్తంతో తడిసిన ఆ నేలలో/ నాలుగు స్నేహహస్తాలు నాటిపో" అని పిలుపునిస్తున్నారు.

అనువాద కవిత్వ విభాగంలో కొంత ప్రగతిశీలత్వం, అధికంగా స్త్రీలోని స్వచ్ఛమైన ప్రేమ పట్ల ఆరాధనా భావం కనిపిస్తాయి. గంభీరమైన శరీరాకృతి దృష్ట్యా చూసినా, సాహిత్య నేపథ్యం దృష్ట్యా చూసినా, సాహిత్యాన్నీ, సాహితీ పిపాసువులను ఆదరించే గుణం దృష్ట్యా చూసినా ఆయనకు తెలంగాణా సోదరకవి మువ్వా శ్రీనివాసరావు గారితో పోలికలు కనబడతాయి. 'ఆమె మనసు' పద్యం చదివితే ఆయన నిత్యం సామాజికోద్యమాల్లో పాల్గొంటూ తన స్వజీవితాన్ని కోల్పోయిన అసంతృప్తి కొంచెం కనబడుతుంది. "జీవితానికి నిర్వచనం సర్దుబాటు/... పెళ్ళంటే రెండు హృదయాల అఖండ జ్వలిత దీపం" దంపతులు అది గుర్తించి నడుచుకోవాలని ఆయన అంటారు. పెరుగు రామకృష్ణ ఉబుసుపోక కవి కాదు. "ఉదయపు కోడికూత కవిత/... కవిత చప్పట్ల మోత కాదు/ కవిత పుస్తకాల దొంతర కాదు/ కవిత శాలువల సన్మానం కాదు/ కవిత గాయపడ్డ నిస్సబ్ద హదయానికి సజీవస్పర్శ..!" అని ఆయన అన్నట్లు సామాజిక నిబద్ధత కలిగిందే కవిత్వం అన్న అవగాహన, ఆ నమ్మకం ఉన్న సీరియస్ కవి. ఆయన కవిత్వం జున్ను లాగా పసందుగా ఉంటుంది. పెరుగన్నం లాగా హాయిగా ఉంటుంది. ఆయనది గడ్డపెరుగు లాంటి కవిత్వం.

– కవితశ్రీ
94946 96990

ఆవలి తీరం నుంచి అక్షర కిరణాలు

పుస్తకం

"వాళ్ళకేం! అందరినీ వదిలేసి విదేశాలకు పోయి బోలెడంత సంపాదించుకొని హాయిగా స్థిరపడిపోయారు!" తెలుగువాకిళ్లలో అడపాదడపా వినిపించే మాటలే ఇవి. కానీ ఆ వెళ్లినవారి గతి ఏమైందో, ఎన్ని అగచాట్లు పడ్డారో, మాతృదేశంపై మమకారం వారి కళ్ళ నుంచి ఎన్నిసార్లు నీరై ప్రవహించిందో ఎవరికి ఎరుక! కంప్యూటర్లు, వీడియో ఫోన్లు లేని రోజుల్లో మాతృదేశాన్ని వదిలి దూరంగా పరాయి దేశాలకు వెళ్ళిన ప్రవాసీయుల స్థితి, సామాజిక ఇబ్బందులు నేటి తరంవారికి ఊహకు కూడా అందవు.

పరాయి దేశంలో పరాయి సంస్కృతి మధ్య బతకడం, తెగించి బతకనేర్వడం, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడం అంత సులువైన విషయం కాదు. అటువంటిది అక్కడ తమ వారందరినీ కలుపుకుంటూ చిన్నచిన్న సంఘాలుగా ఏర్పడి కలసి సంస్కృతిని సాహిత్యాన్ని ఆచార వ్యవహారాలను కళలను పోషించి కాపాడుకునే ప్రయత్నం చేస్తూ అందులో నిలదొక్కుకోవడం వెనుక ఎంత కృషి ఉంటుందో అర్థం చేసుకోవడం చాలా కష్టం.

వలస వెళ్లడం అనేది కొందరికి ఆశ, కొందరికి అవకాశం, కొందరికి అవసరం, కొందరికి అనివార్యం. కొందరు కాయకష్టాన్ని నమ్ముకుని వెళ్లినవారైతే కొందరు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి వెళ్లారు. కారణం ఏదైనా వారు ఎదుర్కొనే సమస్యలు మాత్రం ఒకటే! 60 సంవత్సరాల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లిన తెలుగువారి పరిస్థితులను, వారి ప్రస్థానాన్ని 'షష్టిపూర్తి' సందర్భంగా పుస్తక రూపంలో తీసుకురావాలనే 'తెలుగు మల్లి' సంస్థ నిర్వాహకులు కొంచాడ మల్లికేశ్వరరావు గారి సంకల్ప కణిక ఇన్నాళ్లకు జ్వాలగా మారి 'తూర్పు తీరంలో తెలుగు రేఖలు'గా వెలుగులు విరజిమ్ముతోంది.

60 ఏళ్ల క్రితం భారతీయ వస్తువులు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు కూడా పూర్తిగా లభ్యం కాని సమయంలో ఆస్ట్రేలియా వచ్చి స్థిరపడిన కుటుంబాలే నేటి ఆస్ట్రేలియాలోని తెలుగువారికి ఎలా ఆదర్శం అయ్యాయో ఈ కథనం తెలియపరుస్తుంది. కొంచాడ రావు ఈ పుస్తక రచన విషయంలో ఎంత శ్రద్ధ వహించారో, ఎన్నాళ్ళు శ్రమించారో నాకు తెలుసు. ఆస్ట్రేలియా అంటే చిన్న దేశమేమీ కాదు. వివిధ ప్రాంతాల్లో 60 సంవత్సరాల క్రితం వచ్చి స్థిరపడిన తెలుగువారి కుటుంబాలను అందరినీ కలుసుకుని, వారి ముందు తరాల వారి విషయాలను సేకరించి ఒక పుస్తక రూపంలో తీసుకురావాలన్న ఆలోచనే ఎంతో హర్షించదగినది, వ్యయప్రయాసలతో కూడుకున్నది. దానికి దేశంలోని తెలుగువారందరూ సహకరించడం, విషయ సేకరణకు అవసరమైన సమాచారాన్ని సమకూర్చడం మరింత ముదావహం. ఆస్ట్రేలియాలో కాలానుగుణంగా విద్య, వైద్య, విజ్ఞాన, సాంకేతిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ తదితర రంగాల్లో తెలుగువారు తమ సత్తా చాటుకున్న తీరు, అక్కడ వచ్చినటువంటి రాజకీయ సామాజిక పరిణామాల ప్రభావం, వలసచట్టాలు, ఆర్థిక స్థితిగతులు వంటి విషయాలను తెలియపరచడంతో పాటు ఆస్ట్రేలియాలోని తెలుగు జీవనాన్ని ప్రతిబింబింపజేసే మొట్టమొదటి ప్రామాణిక గ్రంథంగా ఈ పుస్తకం పేరు తెచ్చుకుంటోంది. అందుకే ఈ పుస్తకం పాఠకులను ఆసక్తికరంగా త్వరగా చదివించేలా చేస్తుంది. పుస్తకం చదువుతున్నంత సేపు దాదాపు ప్రపంచంలో అన్ని దేశాల్లో ఉండే ప్రవాసీయులు తమ దేశంలోని పరిస్థితులతోనూ, తమ స్వీయ అనుభవాలతోనూ పోల్చుకోకుండా ఉండలేరు.

ఆస్ట్రేలియాలో దేవాలయాల నిర్మాణం, తెలుగు సంస్థల ఆవిర్భావ విషయాలు, పలువురు పెద్దల ప్రవాస అనుభవాలు, ఉద్యోగ అవకాశాలు, తెలుగు పత్రికలు, భాషా సాంస్కృతిక వికాసం మొదలైన ఎన్నో విషయాలను ఈ పుస్తకం ద్వారా నేటితరం తెలుసుకోవచ్చు. తూములూరి శాస్త్రి, దూర్వాసుల మూర్తి, డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, డాక్టర్ చేవెళ్ల జనార్ధన రెడ్డి వంటి పెద్దల అనుభవాల నుంచి ఎంతో నేర్చుకోవచ్చు.

మధ్యలో 'ప్రవాసంలో పెళ్లి ప్రహసనం' భలే సరదాగా అలరించింది. ఈ కథతో పాటుగా పాఠకులు కూడా ఒకసారి అలా ఆస్ట్రేలియాలో రంగనాథం ఇంటికి వెళ్లిరావడం ఖాయం. పాయసంలో జీడిపప్పులా, సంభాషణలలో చక్కటి తెలుగు సామెతలు రుచికరంగా ఒదిగిపోయాయి. భార్యాభర్తల సంభాషణలు చాలా హాస్యభరితంగా సహజంగా అమరిపోయాయి. "ఈ మధ్య నిశ్శబ్దమే ఎక్కువ శబ్దం చేస్తోంది", "చీకటిలో కోపం కనిపించలేదు కానీ మాటలో కరుకుదనం వినిపించింది", "ముఖంలో వెలిగిన చిరునవ్వు పెదవులు దాటనివ్వలేదు" "వెళ్తే పని, లేకపోతే జీతం" వంటి ప్రయోగాలు ప్రత్యేకించి నన్ను ఆకట్టుకున్నాయి. మా రావు గారు ఇంతటి కథకులు అని తెలియనేలేదు ఇన్నాళ్లూ! త్వరలో వారి నుంచి మరో కథల పుస్తకం కూడా రావాలని ఆశపడుతున్నాను.

ఆస్ట్రేలియాలో జరిగిన పలు తెలుగు కార్యక్రమాలకు వెళ్లి వచ్చిన కొందరు భారత ప్రముఖులు యొక్క అనుభవాలు, విశ్లేషణ కూడా ఈ పుస్తకానికి మరింత వన్నె తెచ్చాయి. పత్రికలు, కవితలు, కథలు, పాటలు, పద్యాలు, నాటకాలు, అవధానాలు.. ఒకటేమిటి! ఆస్ట్రేలియాలోని తెలుగువారు స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆస్ట్రేలియా ఖండంలోని పలు ప్రాంతాల్లో విలసిల్లిన తెలుగు సంస్థలు, పత్రికలు, రేడియో, టీవీ కార్యక్రమాలు, తెలుగు సదస్సులు, సాంస్కృతిక సమ్మేళనాలతో సహా, న్యూజిలాండ్ దేశంలో కూడా జరిగేటటువంటి తెలుగు కార్యక్రమాల గురించి విపులంగా ఈ పుస్తకంలో ప్రస్తావించడం వల్ల ఖచ్చితంగా ఇది ఇతర దేశస్థులకు మార్గదర్శకంగానూ, స్ఫూర్తిదాయకంగానూ ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.

తెలుగుమల్లి, TAAI, సిడ్నీ తెలుగు సంఘం, తటపర్తి గురుకులం, న్యూజిలాండ్ తెలుగు సంఘం, సంగీత భారతి, మొదలైన సంస్థలతో మా సింగపూర్ 'శ్రీ సాంస్కృతిక కళాసారథి'కి ఉన్న ప్రత్యక్ష అనుబంధం, ఆస్ట్రేలియాలోని తెలుగువారితో నాకున్న వ్యక్తిగత స్నేహం, 'తటపర్తి గురుకులం'లో సభ్యురాలిగా వారితో నాకున్న సాన్నిహిత్యం.. ఈ పుస్తక పఠనం ద్వారా మరొకసారి నెమరు వేసుకుంటూ ఆనందించాను. ఆస్ట్రేలియా తెలుగు ప్రభలు మరింత జాజ్వల్యమానంగా ప్రకాశించాలని ఆకాంక్షిస్తూ, రావు గారికి, ఈ పుస్తకరచనలో భాగస్తులైన వారందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు.

– రాధిక మంగిపూడి

తెలుగు నాటకం అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలి

సంభాషణ

ఇటీవల కవిసంధ్య, యానాం వారి ద్వారా జీవన సాఫల్య పురస్కారాన్ని పొందిన దీర్ఘాసి విజయ భాస్కర్, నాటక రంగంలో తనదైన విశిష్ట పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ టూకీగా...

కథలు , నాటకాలు , కవిత్వం ... ఇలా మూడింటిలోనూ పేరు పొందిన మీకు బాగా ఇష్టమైన ప్రక్రియ ఏది?

నాకు ఇష్టమైన ప్రక్రియ అనేకంటే సమాజానికి ఎక్కువ ఉపకారం చేసేది నాటకం. అందుకే నాటకమంటే ఇష్టం కావచ్చు. కథ, నవల, కవిత్వం... వేటి ప్రత్యేకత వాటికి ఉన్నప్పటికీ నాటకం లక్ష్యం వేరు. అది సామాన్యుని కోసం పుట్టింది. సమాజంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని మొదట కవిత్వం గుర్తిస్తుంది. కథ విశ్లేషించి వివేచన చేస్తుంది. నాటకం పరిష్కారాన్ని సూచిస్తుంది. నవల ఆ సమస్యా పరిష్కారాల ఫలితాల్ని పర్యవసనాల్ని చర్చిస్తుంది. కాబట్టి నాటకం ప్రయోజనం చాలా ఉన్నతమైంది. కాల ప్రక్షాళనమే దాని లక్ష్యం.

మీ రచనల్లో తాత్విక భావజాలం ఉండడానికి నేపథ్యం?

ఇతర జీవులకు , మానవుడికి మధ్య నున్న తేడా తాత్వికతే. Man is a social animal, political animal అంటారు కదా! Man is a philosophical and spiritual Animal. నాటక రచనలో నాకో strategy ఉంది. అదేమిటంటే ఒకటి దోపిడీకి గురై అట్టడుగు పొరల్లో చిక్కుకు పోయిన వారిని వారి హక్కుల పట్ల వారి దుస్థితి పట్ల అవగాహన కలిగించడం. రెండు పాలక వర్గాల చేతిలోనే శాసనాధికారముంటుంది కనుక వారి ఇంట్రెస్ట్‌కి వ్యతిరేకంగా వారు శాసనాలు చేసుకోరు. ఇక వారిలో మార్పు ఎలా వస్తుంది? కేవలం ఆధ్యాత్మిక చింతన వల్ల మాత్రమే మార్పువచ్చే అవకాశం ఉంది . ఇక మూడవది కుటుంబ పరమైన ఇతివత్తాలు. ఆదర్శంగా ఒక ఋషి కన్న ఒక గహస్తుడు బతకడం కష్టం. ప్లేటో పాలకులకు కుటుంబాలు నిషేధించాడు. కుటుంబ సభ్యులు పాలకుల్ని, అధికారుల్ని అవినీతివైపు ఎలా ప్రేరేపిస్తారో చెబుతూ కొన్ని నాటకాలు రాశాను.

మీ నాటకాల్లో కొన్నింటిలో పౌరాణిక నేపథ్యం కనిపిస్తుంది. కారణం ?

మన సామాజిక వ్యవస్థ ఇన్ని అవస్థలతో ఉండడానికి ముఖ్య కారణం పౌరాణిక నేపథ్యంలో మన పూర్వీకుల బుర్రలోకి ఎక్కించిన భావజాలం. ఒకప్పుడు ఎవరైనా నయంకానీ వ్యాధితో బాధపడుతుంటే అది అతను పూర్వజన్మలో చేసుకున్న పాపంగా సర్దిచెప్పుకునేవారు. కొన్ని కులాల వారిచేత అమానుషమైన పనులుచేయించి వారి పాపపుణ్యాలకు లింకు పెట్టారు. పూర్వీకులు అదంతా నిజమని నమ్మారు. బడుగు వర్గాల అణిచివేతకు ఆ కథల్ని ఎలా వాడుకున్నారో ఇప్పుడిప్పుడే సమాజం అర్థం చేసుకుంటోంది. ఈ అవగాహన ఇంకా తొందరగా జరగాలి. అందుకే నేను నాటక రచనలో పౌరాణిక నేపథ్యాన్ని ఉపయోగిస్తున్నాను. మనిషి ఆలోచనా పరిధిని ఏ కండిషనింగ్ ద్వారా కుంచించుకుపోయేటట్టు చేశారో, డీ–కండిషనింగ్ ద్వారా నేను అవగాహనా శక్తిని విస్తత పరచాలని నా ప్రయత్నం.

మీ సూత రంగస్థలి గురించి చెప్పండి ?

రంగస్థల కళల గురించి ఒక ప్రామాణికి గ్రంథం భరత ముని రచించిన 'నాట్యశాస్త్రం'. దీన్ని నాట్యవేదమని పంచవేదమని పిల్చి ఎంతో గౌరవిస్తాం. దీనికి సమాంతరమైనది గ్రీకు తత్వవేత్త రచించిన 'పొయెటిక్స్' అనే గ్రంథం. ఆ తర్వాత ప్రపంచంలో అనేకమైన రంగస్థల సిద్ధాంతాలు, ఉద్యమాలు వచ్చాయి. అవన్నీ పాశ్చాత్య దేశాల నుంచి వచ్చినవే తప్ప, భారతీయ సంస్కృతీ నాగరికతల మీద ఆధారపడి ఏ రంగస్థల సిద్ధాంతం రాలేదు. భారతీయ సంస్కతీ ఆధారంగా ఉన్న ఐతిహ్యాలను, పాత్రలను, సామాజిక వ్యవస్థలను, వ్యక్తులను, విలువలను, చారిత్రక లోటుపాట్లను, తద్వారా కొన్ని తరగతులవారు అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యాన్ని, సామాజిక అసమతౌల్యాన్ని వ్యాఖ్యానిస్తూ విశదీకరిస్తూ వాటికి మార్గాన్వేషణ చేస్తాడు 'సూతుడు'. సూత మహర్షి మనకూ అష్టదశ పురాణాలు చెప్పినవాడు. అతని పేరుతో 'సూత రంగస్థలి'గా నా సిద్ధాంతం ఉంటుంది

తెలుగు నాటక రంగం స్టేజ్‌క్రాఫ్ట్‌లో వెనుకబడి ఉందని పదేళ్ల క్రితం అన్నారు . ఇప్పుడూ అదే అభిప్రాయంతో ఉన్నారా?

ఈ పదేళ్లలో కూడా థియేటర్ల నిర్మాణపరంగా ఏ కృషీ జరగలేదు. స్టేజ్‌క్రాఫ్ట్‌లో గుణాత్మక మార్పులు రావాలంటే పరిపూర్ణ సాంకేతిక థియేటర్లు రావాలి. మనకు మంచి రచయితలున్నారు. నటీనటులు, దర్శకులున్నారు. లేనిదంతా ఆదరణ, ఆవరణ. ఇతర సాహిత్య ప్రక్రియలకు ఒకటే భాష ఉంటుంది. కానీ నాటకానికి రెండు భాషలుంటాయి. ఒకటి రచయిత వాడే భాష. ఈ భాషను ప్రేక్షకుడికి అందించే క్రమంలో దర్శకుడు వాడే 'రంగస్థల భాష.' ఈ విషయంలో తెలుగు రంగస్థలం వెనుకబడి ఉంది.

ఇటీవల నోబెల్ బహుమతి పొందిన నార్వే రచయిత జాన్ పోసే నాటక రచయిత కూడా! భారతీయ నాటకం ఎప్పటికైనా ఆ స్థాయిని అందుకోవడం ఊహించగలమా?

భారతీయ నాటకమే కాదు; తెలుగు నాటకం కూడా అందుకుంటుంది. ప్రతి సమాజానికి ఒక్కో ప్రత్యేకమైన సాంస్కృతిక నేపథ్యముంటుంది. ఆ నేపథ్యం అర్థమైతే తప్ప ఆ రచనలోని గొప్పదనం అర్థం కాదు. నా 'రాజిగాడు రాజయ్యాడు' తీసుకుందాం. అత్యంత వెనుక బడిన కులాల ప్రతినిధి రాజిగాడు. దిక్కుమొక్కు లేని కులాల ఆవేదన దానిలో ఆవిష్కరించాను. కన్యాశుల్కంలోని సమస్యను అర్థం చేసుకున్నంత బాగా రాజిగాడి ఆవేదన అర్థం చేసుకోరు. ఈ గ్యాప్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనే కాదు. మన రాష్ట్రంలో వివిధ కులాల మధ్య కూడా ఉంటుంది. కాబట్టి అవార్డులిచ్చే వారికి నాటకంలో ఆవిష్కరింపబడే సమాజం పట్ల, సమస్య పట్ల, శిల్పం పట్ల, సాహిత్యవిలువల పట్ల, అవగాహన ఉండాలి. సానుభూతి, సహానుభూతి ఉండాలి. దీనికి ఉదాహరణగా విదేశీయులు మత్స్యకారుల జీవితాన్నీ తెలుసుకోవడంలో లోజె.ఎమ్.సిన్జ్‌ని అర్థం చేసుకున్నట్టు మన గణేష్ పాత్రోని అర్థం చేసుకోలేరు.

మీ భవిషత్తు కార్యాచరణ ఎలా ఉండబోతోంది?

తెలుగు నాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకొని వెళ్లడమే నా భవిషత్తు ప్రణాళిక.

సంభాషణ : టేకుమళ్ళ వెంకటప్పయ్య

ఆరు నెలల జైలు శిక్ష తప్పనిసరి

- కల్తీ పదార్థాల అమ్మకంపై పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు

న్యూఢిల్లీ : అమ్మకానికి ఉద్దేశించిన ఆహార, పానీయాల కల్తీ విషయంలో పార్లమెంటరీ ప్యానెల్ కీలక సిఫారసులు చేసింది. భారతీయ న్యాయ సంహిత బిల్ (బీఎన్ఎస్) కింద తప్పనిసరిగా జైలు శిక్షను విధించాలనీ, ఐదు రెట్లు జరిమానాను పెంచాలని ప్రతిపాదించింది. కల్తీ విషయంలో కనీసం ఆరు నెలల జైలు శిక్ష, గరిష్టంగా రూ. 25 వేల జరిమానాను విధించాలని వివరించింది. ఆగస్టులో ప్రవేశపెట్టబడిన బీఎన్ఎస్ బిల్.. కల్తీ చేయబడిన ఆహార, పానీయాల అమ్మకాల విషయంలో ఆరునెలల వరకు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాను ప్రతిపాదించిన విషయం విదితమే.

బెంగాల్‌లో సిపిఎం పుస్తక ప్రదర్శన కేంద్రాలు

- పండుగల వేళ మత సామరస్యం కోసం కృషి

కొల్‌కతా : పండుగల వేళ పశ్చిమబెంగాల్‌లో మత సామరస్యంపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సిపిఎం కృషి చేస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 1000 పుస్తక ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రగతిశీల సాహిత్యాన్ని వ్యాప్తి చేయడమే కాకుండా రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు కూడా ఈ కేంద్రాలను ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాజధాని కొల్‌కతా నగరంలో సిపిఎం 200కు పైగా పుస్తక కేంద్రాలను ఏర్పాటు చేసింది. సిపిఎంతో పాటు ఇతర వామపక్ష పార్టీలైన సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యూసిఐ, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్, సిపిఐ కూడా పుస్తక కేంద్రాలను ఏర్పాటు చేశాయి. తృణమూల్ కాంగ్రెస్, బిజెపి కూడా ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటి సంఖ్య తక్కువగానే ఉంది. అవి కూడా పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. తృణమూల్ పుస్తక కేంద్రాలు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ రాసిన 40కి పైగా పుస్తకాలు, ఆమె గీసిన చిత్రాలతో నిండిపోయాయి. బిజెపి పుస్తక కేంద్రాలు మోడీ, శ్యాంప్రసాద్‌లపై దృష్టి సారించగా కాంగ్రెస్ కేంద్రాల్లో గాంధీజీ సిద్ధాంతం, నెహ్రూ గురించిన పుస్తకాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. అయితే వామపక్షాలు ఏర్పాటు చేసిన ప్రగతిశీల పుస్తక కేంద్రాల్లో మాత్రం అన్ని రకాల పుస్తకాలు, ప్రధానంగా ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించే పుస్తకాలు లభిస్తున్నాయి.

అదానీ గుప్పిట్లో సముద్రతీరం

- ప్రతి 500 కిలోమీటర్లలోనూ పాగా
- ఓడరేవుల వ్యాపారంపై అంతకంతకూ పట్టుబిగింపు
- పుష్కలంగా మోడీ ప్రభుత్వ అండదండలు
- పోర్టుల్లో పడిపోతున్న ప్రభుత్వ వాటా

న్యూఢిల్లీ : 2001లో అదానీ గ్రూప్ చేతిలో ఒకే ఒక ఓడరేవు ఉండేది. ఇప్పుడో...!? దేశంలోనే అతి పెద్ద ప్రైవేటు ఆపరేటర్‌గా ఎదిగింది. అదానీ చేతిలో ప్రస్తుతం 14 ఓడరేవులు, టెర్మినల్స్ ఉన్నాయి. దేశంలోని ఓడరేవుల ద్వారా జరుగుతున్న సరకు రవాణాలో నాలుగో వంతు ఆ సంస్థే నిర్వహిస్తోంది. గడచిన పది సంవత్సరాల్లో అదానీ చేతికి ఆరు ఓడరేవులు వచ్చాయి. ఈ పరిణామం ప్రభుత్వంలోని ఓ వర్గంలో ఆందోళన కలిగిస్తోంది. నిజమే...దేశంలో 5,422 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. సగటును ప్రతి 500 కిలోమీటర్లకూ అదానీ ఉనికి కన్పిస్తోంది. ఓడరేవుల రంగంలో అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించడం వెనుక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉండడమే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గడచిన పది సంవత్సరాల్లో అదానీ ఓడరేవులు జరిపిన సరకు రవాణా సుమారు నాలుగు రెట్లు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న ఓడరేవుల ద్వారా 337 మిలియన్ టన్నుల సరకు రవాణా అయింది. దేశంలో జరుగుతున్న సరకు రవాణాలో ఏటా 4% వృద్ధి కన్పిస్తుంటే అదానీ గ్రూప్ ఓడరేవుల ద్వారా జరుగుతున్న సరకు రవాణాలో 14% వృద్ధి కన్పించడం విశేషం. మొత్తం సరకు రవాణాలో అదానీ గ్రూప్ మార్కెట్ వాటా 2013లో 9%గా ఉండగా అది ఈ సంవత్సరంలో 24%కి చేరింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని ఓడరేవుల నుండి జరుగుతున్న సరకు రవాణా 58.5% నుండి 54.5%కి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ లేని ఓడరేవుల్లో అదానీ మార్కెట్ వాటా ఇప్పటికే 50% దాటిపోయింది. ఓడరేవుల రంగంలో అదానీ గ్రూప్ మార్కెట్ వాటా గడచిన పది సంవత్సరాల్లో భారీగా పెరగ్గా కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఓడరేవులు కునారిల్లిపోయాయి. వాటి సరకు రవాణా వాటా పడిపోయింది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

37% ఆ గ్రూపుదే

అదానీ గ్రూప్ జరుపుతున్న సరకు రవాణాను 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక విశ్లేషించింది. గత పది సంవత్సరాల్లో దేశంలో 337 మిలియన్ టన్నుల సరకు రవాణా జరగ్గా అందులో అదానీ గ్రూప్ ఓడరేవుల ద్వారా 123.7 మిలియన్ టన్నులు...అంటే 37% సరకు రవాణా అయింది. అదానీ ఓడరేవుకు నౌకలు సరకుతో వచ్చి వెళ్లేందుకు 0.7 రోజులు చాలు. అదే ప్రభుత్వ ఓడరేవులైతే రెండు రోజులు పడుతోంది.

ఏం జరుగుతుంది?

సరకు రవాణాలో అదానీ గ్రూప్ ఆధిపత్యం పెరుగుతుండడంతో షిప్పింగ్ కంపెనీలకు బేరసారాలు జరిపే అవకాశం లేకుండా పోవచ్చు. పోటీ తక్కువగా ఉండడంతో గుత్తాధిపత్యానికి అవకాశం ఉంటుంది. కొత్తగా వచ్చిన లేదా చిన్న చిన్న కంపెనీలకు ఆటంకాలు ఎదురవుతాయి. సరకు రవాణాదారులు అదానీ ఓడరేవుల పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుంది. అదానీ గ్రూప్ తన స్థానాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉంది.

వ్యాపార సామ్రాజ్య విస్తరణ

పది సంవత్సరాల క్రితం అదానీ ఓడరేవుల ద్వారా 91 మిలియన్ టన్నుల సరకు రవాణా జరిగింది. అంటే దేశంలో అన్ని ఓడరేవుల ద్వారా జరిగిన సరకు రవాణాలో కేవలం 10% అన్న మాట. ప్రస్తుత సంవత్సరంలో అదానీ నడుపుతున్న ముద్రా ఓడరేవు ద్వారానే 155 మిలియన్ టన్నుల సరకు రవాణా జరిగింది. ప్రభుత్వ రంగంలోని 12 ఓడరేవుల్లో ఏ ఒక్క ఓడరేవు నుండి కూడా ఈ స్థాయిలో సరకు రవాణా కాలేదు. ప్రభుత్వ ఆజమాయిషీలో లేని ఓడరేవుల్లో అదానీ గ్రూపుదే పైచేయి. ఓడరేవులతో పాటు ఏపీసెజ్ మూడు ప్రధాన పోర్టుల్లో టెర్మినల్స్‌ను నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో సైతం అదానీ ఓడరేవుల్లో వ్యాపారం బాగానే సాగింది. ఏపీసెజ్ సంస్థ అనేక ఓడరేవులను చేజిక్కించుకుంటూ వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఒడిశాలోని ధమ్రా, తమిళనాడులోని కట్టుపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం, గంగవరం, మహారాష్ట్రలోని దిఘీ ఓడరేవులు అదానీ గ్రూప్ చేతుల్లోకి వెళ్లాయి. అదానీ గ్రూప్ ప్రాబల్యం పెరుగుతుండడంపై కాంపిటీటివ్ కమిషన్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్‌పర్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇప్పుడు అంతా బాగానే ఉండవచ్చు. కానీ ఐదు, పది సంవత్సరాల తర్వాత సమస్యలు మొదలవుతాయి. దీనిపై ప్రభుత్వం, సీసీఐ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని ఆయన అన్నారు.

ఇతర రంగాలలోనూ...

ఓడరేవుల రంగంలోనే కాదు ఇతర రంగాల్లో సైతం అదానీ గ్రూప్ దూసుకుపోతోంది. దేశంలో విమానాశ్రయాలను నిర్వహించే అతి పెద్ద ప్రైవేటు రంగ సంస్థ కూడా అదే. ప్రస్తుతం దీని అజమాయిషీలో ఎనిమిది విమానాశ్రయాలు నడుస్తున్నాయి. ఇక దేశంలో అతి పెద్ద సిమెంట్ ఉత్పత్తిదారు, ప్రయివేటు రంగంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిదారు కూడా అదానీ గ్రూపే.

31న 'మేరా యువ భారత్' ప్రారంభం

న్యూఢిల్లీ : దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసేందుకోసం ఈ నెల 31న 'మేరా యువ భారత్' వేదిక పేరిట స్వతంత్ర సంస్థను ప్రారంభించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఆదివారం మన్ కీ బాత్ 106వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించేందుకు 'మేరా యువ భారత్' అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ నెల పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో ఖాదీ దుస్తులు, స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేశారని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 'లోకల్ ఫర్ వోకల్' నినాదానికి ఇది ఎంతో బలాన్నిస్తుందన్నారు. దేశంలోని యువతీయువకులు MYBharat.Gov.in లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. 'అక్టోబరు 31న దేశంలో అతిపెద్ద సంస్థను ప్రారంభించబోతున్నాం. దాని పేరు మై యంగ్ ఇండియా, మేరా యువ భారత్. దేశాభివద్ధి కోసం నిర్వహించే కార్యక్రమాల్లో యువత కీలక పాత్ర పోషించేందుకు ఈ వేదిక అవకాశాలను కల్పిస్తుంది. యువశక్తిని ఏకీకతం చేయడానికి ఇదో వినూత్న ప్రయత్నం' అని ప్రధాని తెలిపారు.

పార్వతీపురం పట్టణంలో ఏనుగు సంచారం

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో సంచరిస్తున్న ఏనుగు

పార్వతీపురం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌తోపాటు పట్టణంలోని కొత్తవలసలో ఉన్న పలు కాలనీల్లో ఏనుగు శనివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో సంచరించింది. దీంతో, ఆయా ప్రాంతాల ప్రజలతోపాటు పట్టణ ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ ఒంటరి ఏనుగు పట్టణ రైల్వే స్టేషన్, మణికంఠ కాలనీ, కెపిఎం పాఠశాల వీధి, పెద్దవీధి ప్రాంతాల్లో కలియ తిరిగింది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టమూ చేయకుండా తిరిగి కొమరాడ మండలం పరసురాంపురం వైపు వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగు అర్ధరాత్రి సంచరించడం, ఆ సమయంలో జనసమ్మర్ధం లేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదంటున్నారు.

ఢిల్లీలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న ఏచూరి

పాలస్తీనాకు బాసటగా నిలుద్దాం

- ఢిల్లీలో సిపిఐ(ఎం) భారీ ధర్నా
- మోడీ ప్రభుత్వ తీరుపై విమర్శలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సామ్రాజ్యవాద శక్తుల అండతో ఇజ్రాయిల్ గాజాపై సాగిస్తున్న క్రూరమైన దాడులకు వ్యతిరేకంగా, గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రజలకు సంఘీభావంగా సిపిఎం భారీ ధర్నా నిర్వహించింది. ఆదివారం నాడిక్కడి ఎకెజి భవన్ వద్ద సిపిఐ (ఎం) భారీ ధర్నా నిర్వహించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి అనుగుణంగా ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలు తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ధర్నా నుద్దేశించి ప్రసంగించిన నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. పాలస్తీనియన్లు పాశవిక దాడులకు గురవుతున్నారన్నారు. "దాదాపు ఎనిమిది వేల మంది చనిపోయారు. వీరిలో దాదాపు సగం మంది పిల్లలు, మహిళలు ఉన్నారు. సహాయక చర్యలు నిలిచిపోయాయి. అన్ని కమ్యూనికేషన్లకు అంతరాయం ఏర్పడింది. కూలిన భవనాల శిథిలాల మధ్య ఎంతమంది చిక్కుకుపోయారో చెప్పలేం. ఈ క్రూరమైన దాడిని తక్షణమే ఆపాలి. 1967కి పూర్వపు సరిహద్దులతో, తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయాలన్న ఐరాస తీర్మానానికి అన్ని పక్షాలు కట్టుబడి ఉండాలని అన్నారు. భద్రతా మండలి తీర్మానానికి భారత్ ఇంతకాలం మద్దతు ఇచ్చింది. మోడీ ప్రభుత్వం ఇప్పుడు దీని నుంచి వెనక్కి తగ్గింది.

అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ఆక్రమణకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. లండన్‌లో పాలస్తీనా కోసం నాలుగు లక్షల మంది ర్యాలీ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్షాలు నిరసనలకు దిగుతున్నాయి. ఈ నిరసనలో సిపిఐ(ఎం) కేంద్ర నాయకత్వం కూడా భాగం అయింది. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారంపై తన స్వంత నిర్ణయాన్ని అమలు చేయడానికి ఐరాస చొరవ చూపాలి. భారత ప్రభుత్వం కూడా దీనికి పూర్తి మద్దతు తెలపాలని ఏచూరి కోరారు.

మోడీ ప్రభుత్వం ఇజ్రాయెల్ దురాక్రమణదారులకు నిస్సిగ్గుగా మద్దతు ఇస్తోందని ఆయన విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ పాలస్తీనాలో వేలాది మంది చిన్నారులపై ఇజ్రాయెల్ చేస్తున్న ఊచకోత సాగించడం దారుణమన్నారు. ఐరాసలో పాలస్తీనా అనుకూల తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడం విస్మయం కలిగిస్తోందన్నారు.

పాలస్తీనాలో అమాయకులు చనిపోతున్నారు. మహిళలు, పిల్లలు చంపబడుతున్నారు. ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 8,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 19,000 మంది గాయపడ్డారు. 14 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఒక్క గాజాలోనే 87,000 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ దాడితో పూర్తిగా ధ్వంసమైన గాజాలో శాశ్వత కాల్పుల విరమణ పాటించాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది. ధర్నా నుద్దేశించి మాట్లాడినవారిలో పార్టీ పొలిట్ బ్యూరో భ్యులు బృందా కరత్, మాణిక్ సర్కార్, మహమ్మద్ సలీమ్ తదితరులు ఉన్నారు. బిమన్ బసు అధ్యక్షత జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బివి రాఘవులు, సుభాషిణి అలీ, ఎంఎ బేబీ, ఎ. విజయరాఘవన్, జి రామకృష్ణన్, సూర్యకాంత్ మిశ్రా, తపన్ సేన్, అశోక్ దావలే, ఎంవి గోవిందన్, కేంద్ర కమిటీ సభ్యులు బిమన్ బసు, బి.వెంకట్, యూసఫ్ తరిగామి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను కెసిఆర్ అప్పులపాలు చేశారు

- ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పేద ప్రజలను ఆదుకోవడంలో విఫలమైన కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పులపాలు చేసిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో కార్పొరేట్లు మాత్రమే బాగుపడుతున్నారనీ, పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఉద్యోగాలు భర్తీ చేసి యువతకు మేలు చేసే ఉద్దేశం మోడీ ప్రభుత్వానికి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే హైదరాబాద్‌కు ఎన్నో జాతీయ సంస్థలు వచ్చాయని, వాటి ద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చిందని, ఇప్పుడు కూడా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు విషయంలో సిఎం కెసిఆర్ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ధర రహస్యమేంటో ఓటుతో చెబుతారు

దేశంలో ఉల్లి ధరల పెరుగుదలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు రాష్ట్రాల ప్రజలు బిజెపిని ఓడించడం ద్వారా ఉల్లి ధరలు మళ్లీ ఎందుకు పెరిగాయో రహస్యం చెబుతారని ఖర్గే అన్నారు. ఢిల్లీలో ఉల్లి ధర కిలో రూ.80 వరకు చేరుకోవడంతో ఖర్గే ఈ విమర్శలు చేశారు. గత తొమిదిన్నర ఏళ్ల బిజెపి పాలనలో ద్రవ్యోల్బణ భారంతో ప్రజలు ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని ఆయన ట్వీట్ చేశారు. ద్రవ్యోల్బణ సమస్యపై మోడీ ప్రభుత్వం ప్రతిసారీ ప్రజలను ఎగతాళి చేస్తూనే ఉందని విమర్శించారు. 'ద్రవ్యోల్బణం కనిపించడం లేదు', 'నేను ఉల్లి పాయలు తినను', 'ఇతర దేశాల కంటే తక్కువగానే (ద్రవ్యోల్బణం) ఉంది' వంటి అర్థంపర్థం లేని సమాధానాలతో బిజెపి నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తూవస్తున్నారని ఆయన తప్పుబట్టారు. 'మళ్లీ ఉల్లి ధరలు ఎందుకు పెరిగాయి? సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటున్న బిజెపి నేతలకు ఉల్లి ధరాఘాతం రహస్యమేమిటో ఐదు రాష్ట్రాల ప్రజలు ఓటు ద్వారా విడమర్చి సమాధానమివ్వడం ద్వారా బిజెపికి గుణపాఠం చెబుతారని ఖర్గే తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ బరిలో నేరచరితులు

- అత్యధికులు బిజెపి అభ్యర్థులే

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ శాసనసభ తొలి దశ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 223 మంది అభ్యర్థుల్లో 26 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వీరిలో 16 మందిపై అత్యంత తీవ్రమైన కేసులు నడుస్తున్నాయి. మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేరచరితుల్లో అత్యధికంగా ఐదుగురు బిజెపికి చెందిన వారు కాగా అధికార కాంగ్రెస్‌కు చెందిన వారు ఇద్దరు, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన నలుగురు, జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జె)కి చెందిన ముగ్గురు ఉన్నారు. మొదటి విడతలో 20 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. వీటిలో ఐదు స్థానాల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది నేరచరితులు పోటీ పడుతున్నారు. బిజెపి అభ్యర్థుల్లో విజయ్ శర్మ (కవర్ధా స్థానం), విక్రాంత్ సింగ్ (ఖైరాఘర్), వినాయక్ గోయల్ (చిత్రకోట్-ఎస్టీ), అస్‌హరామ్ నేతమ్ (కన్‌కర్-ఎస్టీ), సోయమ్ ముక్కా (సుక్మా-ఎస్టీ) తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్లలో తెలియజేశారు. తొలి దశ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 46 మంది కోటీశ్వరులు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన వారు 14 మంది ఉండగా బిజెపి, ఆప్ పార్టీలకు చెందిన వారు ముగ్గురు చొప్పున ఉన్నారు.

'నోటా' తీసెయ్యాలి

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భఘేల్

రాయ్‌పూర్ : ఎన్నికల్లో 'నోటా' ఆప్షన్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భఘేల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నోటా'ను తీసేయాలన్నారు. ఆ ఆప్షన్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం 2013లో ఈవీఎంలపై నోటాను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు నోటాపై ఛత్తీస్‌గఢ్ సీఎం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. " కొన్ని సందర్భాల్లో గెలుపు, ఓటముల (ఇద్దరు అభ్యర్థుల మధ్య) కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పోల్ అవుతున్నాయి. ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించాలి" అని రాయ్‌పూర్‌లో నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన అన్నారు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎన్నికలు నవంబర్ 7, 17 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి.

ప్రార్థనా సమావేశంలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

తయారీ కోసం వాడిన సామగ్రిని మార్టిన్ నివాసంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తు తర్వాతే నిర్ధారణ : సిఎం

బాంబు పేలుడు ఘటనను ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. సిపిఎం కేంద్రకమిటీ సమావేశంలో పాల్గొనేందుకు న్యూఢిల్లీలో ఉన్న విజయన్ పేలుడు ఘటన అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, అది పూర్తయిన తర్వాతే తదుపరి వివరాలు వెల్లడిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఘటనలో చనిపోయిన, గాయపడినవారి సంఖ్యను ఆయన నిర్ధారించారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం పరిరక్షించేందుకు, సామరస్యతను పెంపొందించేందుకు వీలుగా ఈ నెల 30న అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం బాంబు పేలుడును తీవ్రంగా ఖండించింది. కేరళ ప్రజానీకం శాంతియుత జీవనాన్ని గడుపుతారని, శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకే ఈ దాడి జరిగినట్లుగా భావిస్తున్నామని పేర్కొంది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. కాగా ఈ దాడిలో గాయపడినవారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందిస్తోంది. సెలవులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు, ఉద్యోగులందరూ తక్షణమే విధుల్లో చేరాలని ఆరోగ్య, వైద్య విభాగాధిపతులకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి ఆదేశాలు జారీ చేశారు.

ఆసుపత్రి సమీపంలో బాంబుల వర్షం

- గాజాపై అమానవీయ దాడులు
- ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో మరణించినవారి మృతదేహాలను అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న స్థానికులు

గాజా సిటీ : హమస్‌ను అణిచేసే పేరుతో మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ మరింతగా రెచ్చిపోయి అమానవీయ దాడులకు తెగబడుతోంది. గాజా సిటీలోని అల్ ఖుదాస్ ఆసుపత్రికి అతి సమీపంలో ఆదివారం సాయంత్రం బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో 116 మంది వైద్య సిబ్బందితో సహా 200 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, పెద్ద సంఖ్యలో గాయపడ్డారని స్థానిక మీడియా పేర్కొంది. చనిపోయినవారిలో సివిల్ డిఫెన్స్‌కు చెందినవారు 18 మంది ఉండగా, 35 మంది పాత్రికేయులు కూడా ఉన్నట్లు గాజా మీడియా ప్రతినిధి మౌరఫ్ తెలిపారు.

ఆసుపత్రిని ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేసిన ఇజ్రాయిల్ ఆ వెంటనే వైమానిక దాడులతో విరుచుకుపడింది. క్షతగాత్రులు, సాధారణ రోగులకు వైద్య సేవలందించడంతో పాట దాదాపు 14 వేల మందికి సహాయక శిబిరంగానూ ఈ ఆసుపత్రి ఆశ్రయాన్ని కల్పిస్తోంది. ఆసుపత్రులను లక్ష్యం చేసుకొని ఇజ్రాయిల్ దాడులకు తెగబడటాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) తీవ్రంగా ఖండించింది. గాజాలో సాగిస్తున్న కాల్పులను, దాడులను తక్షణమే నిలిపివేయాలని ఐక్యరాజ్యసమితి కూడా పదేపదే ఇజ్రాయిల్‌ను కోరుతోంది. కానీ ఇజ్రాయిల్ మాత్రం యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది.

గాజాలో యుద్ధం మరింత కాలం, మరింత తీవ్రంగా కొనసాగుతుందని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ హెచ్చరించారు. వైమానిక దాడులు, భూతల దాడులు మరింతగా విస్తరించాయి. ఆసుపత్రులను లక్ష్యం చేసుకొని దాడులకు పాల్పడటం ఇదే తొలిసారి కాదు. ఇదే నెల 17న సైతం గాజాలోని అల్ అహ్లీ అరబ్ హాస్పిటల్‌పై ఇజ్రాయిల్ బాంబుదాడులకు పాల్పడింది. నాటి ఘటనలో 500 మంది చనిపోయారు. వీరిలో అత్యధికులు చిన్నారులు, మహిళలే. కాగా ఇజ్రాయిల్ భూతల దాడులను అంతకంతకూ విస్తరిస్తూపోతోంది. పెద్ద సంఖ్యలో సైనిక బలగాలు గాజా చేరుకొని అక్కడి ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను ఆక్రమిస్తున్నాయి. 80 ప్రభుత్వ భవనాలను ఇజ్రాయిల్ ఆక్రమిత బలగాలు స్వాధీనం చేసుకొన్నాయని, 47 వరకు మసీదులను ధ్వంసం చేశారని స్థానిక మీడియా తెలిపింది. 208 పాఠశాలలను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

ఈ నెల 7 నుంచి సాగిస్తున్న ఇజ్రాయిల్ దాడుల్లో ఒక్క గాజా సిటీలోనే ఆదివారం నాటికి 8005 మంది చనిపోయారు. వీరిలో 3500 మంది వరకు చిన్నారులే ఉన్నారు. మరోవైపు గాజాలో టెలికమ్యూనికేషన్ల వ్యవస్థను వేగంగా పునరుద్ధరిస్తున్నారు.

చిన్నారులు విలవిల్లాడిపోతున్నారు : ఐసిసి

గాజాలో మానవసాయానికి ఇజ్రాయిల్ ఆటంకాలు సృష్టిస్తుండటం పట్ల అంతర్జాతీయ సంస్థలు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. ప్రధానంగా చిన్నారులు, మహిళలు ఆహారం, కనీస అవసరాల కోసం విలవిల్లాడిపోతున్నారని రఫా సరిహద్దు వద్ద అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. మానవతా సాయానికి ప్రత్యేకించి చిన్నారులకు, మహిళలకు, సాధారణ పౌరులకు అందించే మానవతా సాయానికి ఏవిధమైన అడ్డంకి ఉండకూడదని ఆయన అన్నారు. ఇది చాలా ప్రాథమికమైన హక్కు అని పేర్కొన్నారు. గాజా ప్రజలంతా అమాయకులని, సాయాన్ని పొందడం అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం వారి హక్కు అని స్పష్టం చేశారు. చట్టాన్ని పరిరక్షించి సహాయాన్ని అందించేందుకు అంతర్జాతీయ సమాజం ముందుకు రావాలని, ఈ నేరాలకు ఒడిగడుతున్నవారిపై తగిన విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామాయిల్ ఇంధనంతో తొలిసారి నింగికెగిరిన విమానం

జకర్త : పామాయిల్ ఉపయోగించి తయారు చేసిన ఇంధనంతో ఒక ప్రయాణీకుల విమానం తొలిసారి నింగికెగిరింది. ఇండోనేషియాకు చెందిన విమానయాన సంస్థ గరుడ ఇండోనేషియా ఈ విషయాన్ని తెలిపింది. పామాయిల్‌తో కలిపిన విమాన ఇంధన ఉపయోగించి కమర్షియల్ ప్యాసింజర్ విమానాన్ని విజయవంతంగా నడిపినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ ఇంధనంతో బోయింగ్ 737-800 ఎన్‌జి విమానం 100 మందికి పైగా ప్రయాణీకులతో శుక్రవారం బాంటెన్ ప్రావిన్స్‌లోని సోకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 550 కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంట్రల్ జావాలోని ఆది సోమార్మో అంతర్జాతీయం విమానాశ్రయానికి బయలుదేరిందని తెలిపింది. 'ఇది మొదటిసారి. విజయవంతమైన ట్రయల్. ఒక వాణిజ్య విమానానికి జీవ ఇంధనాన్ని ఉపయోగించాం' అని గరుడ ఇండోనేషియా అధ్యక్షులు డైరెక్టర్ ఇర్ఫాన్ సెటియాపుత్ర వెల్లడించారు. ప్రత్యామ్నాయ జెట్ ఇంధనాన్ని ఇండోనేషియా ప్రభుత్వ ఇంధన సంస్థ పిటి పెర్టమినా ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోనే అతి పెద్ద పామాయిల్ ఉత్పత్తిదారుగా ఇండోనేషియా ఉన్న సంగతి తెలిసిందే.

ఫ్లోరిడాలో కాల్పులు

- ఇద్దరి మృతి, 18 మందికి గాయాలు

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి వెర్రితలలు వేస్తున్నది. తాజాగా ఫ్లోరిడాలో ఒక వీధిలో జరిగిన కాల్పులు ఘటనలో ఇద్దరు మరణించారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఫ్లోరిడాలోని ఈస్ట్ 7వ అవెన్యూలోని 1600 బ్లాక్‌లో ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు ఈ ఘటన జరిగినట్లు టంపా పోలీస్ చీఫ్ లీ బెర్కావ్ మీడియాకు తెలిపారు. రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవతో ఈ కాల్పుల ఘటన చోటు చేసుకుందని చెప్పారు. రెండు గ్రూపుల మధ్య ఘర్షణకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, మృతుల్లో 14 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు సమాచారం.

మీకోసం

గ్యాస్ స్టవ్ కొత్తదానిలా మెరవాలంటే నిమ్మకాయ తొక్కలను ఉడికించి ఆ నీటిలో స్పాంజిని ముంచి తుడవాలి.

జీవన సౌరభం

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

జంతుస్వామ్యం

అనగనగా ఓ అడవి. అందులో చాలా జంతువులు నివసిస్తూ ఉండేవి. అవి మొదట్లో కొంతకాలం సఖ్యతగానే ఉన్నా.. రానురాను వాటి మధ్యలో కీచులాటలు మొదలయ్యాయి. 'ఈ అడవికి నేనే రాజును' అని సింహం అనుకుంటూ ఉండేది. కానీ అది ఇతర జంతువులకు నచ్చేది కాదు. 'ఎప్పుడూ ఈ సింహానిదే పైచేయిగా ఉంటోంది. ఎంత కాలం ఇలా?' అని మిగతా జంతువులు ఆలోచించసాగాయి. ఈ విధంగా కాకుండా ఒక్కొక్క జంతువు కొంత కొంత కాలం రాజుగా ఉండాలని కొన్ని జంతువులు భావించాయి. కానీ అది కూడా కుదరలేదు.

సింహం తన దుర్మార్గంతో అందరినీ భయపెడుతోంది. కాబట్టి అది రాజుగా పనికిరాదు అనుకున్నాయి. నక్క జిత్తులమారి, ఎప్పుడూ కుట్రలు పన్నుతూ ఉంటుంది. అందువల్ల అదికూడా రాజుగా ఉండటానికి వీలు లేదనుకున్నాయి. జింక తన అందం చూసుకుని మురిసిపోతుంటుంది. నెమలి అస్తమానం నాట్యంలో మునిగి పోయి ఉంటుంది. కుందేలు ఎక్కడ చిన్న అలికిడి అయినా పిరికిగా పారిపోతుంటుంది. కాబట్టి ఇవేవీ రాజుగా పనికిరావనుకున్నాయి. అప్పుడు ఒక కోతి కలుగజేసుకుని 'ఈ సమస్యను మనుషులు ఎలా పరిష్కరించుకుంటున్నారో నేను నగరంలోకి వెళ్లి చూసి వస్తాను' అని చెప్పిబయలుదేరింది.

కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన కోతి 'మనుషులలో రాజులంటూ ఇప్పుడు ఎవరూ లేరు. అందరూ కలిసి వాళ్ళను వాళ్లే పరిపాలించుకుంటున్నారు' అని చెప్పింది. ఇదేదో చాలా బాగుందని జంతువులన్నీ ఏకగ్రీవంగా అనుకున్నాయి. సింహం, నక్క, జింక, నెమలి, కోతి, కుందేలు అన్నీ కలిసి 'జంతుస్వామ్యం' ఏర్పాటు చేసుకున్నాయి.

ముద్ర కొండారెడ్డి,
బి.కొత్తకోట, అన్నమయ్య జిల్లా.

సరైన ఒత్తులు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఒత్తులు ఏ అక్షరానికి సరిపోతాయో సరిగ్గా రాయండి చూద్దాం.

ఖ ఖ ఘ జ గ ట ం ఛ ఛ

ఖ–	ఠ–
జ–	ఛ–
గ–	ఘ–
చ–	ట–

నేను గీసిన బొమ్మ



ఎ. లావణ్య,
5వ తరగతి,
దిగువ సాంబయ్యపాళెం,
తొట్టంబేడు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వైకల్యాన్ని జయించే తర్ఫీదు

సమాజంలో కొందరు తమ సంపాదనను కుటుంబానికి ఖర్చు చేస్తూ, ఇంకా ఉంటే తరువాతి తరాల కోసం దాస్తుంటారు. మరికొందరు మాత్రం తాము సంపాదించిన దానిలో ఇతరులకు సహాయపడటానికి ఉపయోగిస్తారు. పుదుచ్చేరికి చెందిన సి.గణేషన్ ... వికలాంగ పిల్లలకు అన్ని విధాలుగా సహాయం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. వైకల్యం ఉన్న పిల్లల్లో ఆత్మన్యూనతాభావాన్ని పోగొట్టడానికి, వారిలో నిబిడీకృతమైన సృజనాత్మకత శక్తులను వెలికితీయటం ద్వారా ఉన్నతులుగా తయారు కావటానికి తన వంతుగా కృషి చేస్తున్నారు.

1989లో పుదుచ్చేరికి చెందిన సి.గణేషన్ అధ్యాపకుడిగా పనిచేసేవారు. అతడి అక్క జిప్‌మర్‌లో నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అతడు తన అక్కకు తోడుగా వైద్యశిబిరాలకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఓసారి జిప్‌మర్ సంస్థ ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. తన అక్కతో పాటు ఆ శిబిరానికి వెళ్లిన గణేశన్ ... శిబిరానికి హాజరైన పిల్లలను చూసి గణేషన్ చలించిపోయాడు. శారీరక వైకల్యంతో బాధపడే పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు ఇలా అనేకమంది ఇక్కడికి వచ్చారు. నడవలేని వారు, మరుగుజ్జుతనం, చూపులేనివారు, మూగ, చెవిటి వారు, మానసిక వైకల్యంతో బాధపడేవారు ... ఇలా రక రకాల సమస్యలతో బాధపడేవారు తారస పడ్డారు. ఈ శిబిరానికి రావటానికి వారు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశాడు. వారికి తగిన శిక్షణ ఇస్తే ... వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ఏమన్నా సాధిస్తారు కదా ... అని బలంగా భావించాడు.

కారున్నై విద్యాసంస్థ ఏర్పాటు

ఆ ఆలోచనను అక్కతోనూ, భార్యతోనూ పంచుకొని ... పుదుచ్చేరిలో వికలాంగ పిల్లల కోసంకారున్నై స్కూలు ఏర్పాటుచేశాడు. అది పూర్తిగా ప్రత్యేకావసరాలున్న పిల్లల కోసమే! అది సఫలం కావటానికి కొన్ని సంవత్సరాలు పట్టింది. వికలాంగ పిల్లలకు చదువుతోపాటు వివిధ నైపుణ్యాల్లో కూడా శిక్షణ ఏర్పాటు చేశారు. మరికొందరికి థెరపీ సైతం అందజేశారు. గణేషన్ చేస్తున్న కృషిని స్వచ్ఛంద సంస్థలు గుర్తించాయి.

రోటరీ క్లబ్ ఆఫ్ కాస్మోస్, రోటరీ క్లబ్ సెంట్రల్, ఇంటిగ్రా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ వంటి సంస్థలు విరాళాలను అందజేశాయి. గణేషన్ సతీమణి రేవతి కూడా ఈ కృషిలో భాగస్వాములయ్యారు. ఆమె ఆడియాలజీ, స్పీచ్ థెరపీలో స్పెషలిస్ట్‌గా మారారు. పిల్లలతో మరింత మమేకమయ్యారు. పిల్లలకు చదువుతోపాటు వారు ఆనందంగా గడిపేందుకు క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం వంటి వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు.

నైపుణ్యం సాధించి..

కరున్నైలోని అధ్యాపకులు, తల్లిదండ్రులు, సహాయక సిబ్బంది పిల్లలతో సన్నిహితంగా మెలుగుతారు. తగిన బోధనా పద్ధతులను కొనసాగిస్తారు. విద్యార్థి బలాబలాలు, వారి అవసరాలను బాగా అర్థం చేసుకోవటానికిగాను తల్లిదండ్రులతో మాట్లాడారు. తెలుసుకున్న అంశాల ఆధారంగా సమగ్ర విద్యా విధానంతో బోధన అందుబాటులో ఉంచుతారు. చదవటం, రాయటం, ఆర్థిక అక్షరాస్యత, అవసరమైన సాంకేతికత, వ్యక్తిగత, సామూహికంగా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 8 మంది అనాథలతోపాటు 85 మంది విద్యార్థులు ఉన్నారు.

తొమ్మిదేళ్ల క్రితం కారున్నైలో చేరినప్పుడు బహూర్‌కు చెందిన అజిత్ వయసు 15. ఇప్పుడు అతడు దుకాణం, వంటగదిని నిర్వహిస్తున్నాడు. కారున్నై నుండి వచ్చే జీతంతో తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ సంస్థలో పనిచేస్తూ, తమ కుటుంబ ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు రూ.4.5 లక్షలు సహాయంగా ఇచ్చానని మురుగవల్లి గర్వంగా చెప్పారు. మత్తిని బంధువులు విడిచిపెట్టడంతో పోలీసులు కారున్నైకి తీసుకొచ్చారు. నేడు, అతను నివాసి మాత్రమే కాదు. ఇంటి పర్యవేక్షకుడు కూడా. ఎన్ఐఒఎస్ స్కీమ్ ద్వారా 10 మంది ఇక్కడి విద్యార్థులు సెకండరీ విద్యను పూర్తి చేశారు. మరికొందరు మెకానిక్, స్క్రీన్ ప్రింటింగ్, బుక్ బైండింగ్, హౌస్ కీపింగ్‌లో శిక్షణ పొందుతున్నారు.

దోమల నుంచి కాపాడే తెరలు

దోమల నుంచి రక్షణ లేకపోతే వాటి కాటుకు గురై వివిధ వ్యాధుల భారిన పడుతుంటాం. వాటి నుంచి మనల్ని రక్షించుకునేందు మంచి దోమల తెరలు వినియోగించడం ఎంతో అవసరం. ఇంట్లో కిటికీలు, దర్వాజాలకు తగిలించే దోమతెరలు కూడా ఉన్నాయి. దుప్పట్లా కప్పుకునే దోమ తెరలూ మార్కెట్లో అందుబాటులో విరివిగా ఉన్నాయి. ఇవే కాకుండా మంచానికి సరిపడా ఏర్పాటుచేసుకునే దోమ తెరలకు ఇప్పుడు ఆదరణ బాగా పెరిగింది. మడత పెట్టేందుకు అనుకూలంగా ఉండేవి కూడా ఉన్నాయి. ప్రయాణానికి వెళ్లినప్పుడు వినియోగించడానికి కూడా అనువైనవి కూడా ఉన్నాయి. కొన్ని దోమలను చంపే పదార్థాలతో ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వాడటం హానికరం. అందుకోసం డబుల్‌బెడ్స్, సింగిల్‌బెడ్స్‌కు సరిపోయే మృధువైన ఫ్యాబ్రిక్స్‌తో మస్కిటో నెట్స్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఇవి తెరవటానికి, మూసివేయటానికి అనుకూలంగా ఉంటాయి.

డబుల్‌బెడ్ నెట్ (క్లాసిక్ మస్కిటో నెట్ డబుల్‌బెడ్) : ఈ దోమల తెర డబుల్ బెడ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది కింగ్ సైజులో లభిస్తుంది. మస్కిటో నెట్ పీవీసీతో తయారు చేయబడింది. ఈ దోమ తెరలో ఇద్దరు పెద్దవారు, ఒక చిన్నారి నిద్రించొచ్చు. దీన్ని సులభంగా మడతపెట్టొచ్చు. ఇది సెల్ఫ్ సపోర్టింగ్ కలిగి ఉంది. జిప్పర్ క్లోజర్‌ను కలిగి ఉంది. మార్కెట్లో వివిధ కంపెనీలు తయారుచేసిన ఈ దోమ తెరలు అందుబాటులో ఉన్నాయి.

గుడ్‌నైట్ నెట్ బెడ్ (గుడ్‌నైట్ మస్కిటో నెట్) : ఈ దోమల తెర డబుల్ బెడ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది క్వీన్ సైజ్ బెడ్. 30 జీఎస్ఎం స్ట్రాంగ్ నెట్ కలిగి ఉంది. ఇది ఎక్కువ కాలం మన్నుతుంది. ఫోల్డబుల్. అంటే సులవుగా మడత పెట్టొచ్చు. ఇది తక్కువ బరువు కలిగి ఉంది. దీన్ని సులువుగా సెట్ చేసుకోవచ్చు.

పాలిస్టర్ ఫోల్డబుల్ (క్లాసిక్ మస్కిటో నెట్ ప్రీమియమ్ పాలిస్టర్ ఫోల్డబుల్ :
ఈ దోమల తెర ప్రీమియం పాలిస్టర్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేయబడింది. దీన్ని బెడ్ పై సులభంగా ఉంచొచ్చు. సులభంగా ఉతుక్కోవచ్చు. దీని మెష్ ఎంతో బిగుతుగా ఉంటుంది. రెండు జిప్పర్ క్లోజర్ కలిగి ఉంది. సులువుగా దోమల తెరలోనికి వెళ్లొచ్చు.

హెల్తీ స్లీప్ (హెల్తీ స్లీపింగ్ పోర్టబుల్ పోలిస్టర్ డబుల్ బెడ్ మస్కిటో నెట్ : ఈ దోమల తెరను సులభంగా మడతపెట్టొచ్చు. పాలిస్టర్ మెటీరియల్‌తో తయారు చేయబడింది.

క్రేజీ కాంబినేషన్‌తో 'హిట్లు' కొడుతున్న సినిమాలు



సినీ పరిశ్రమలో కొత్త దనాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారు. దీంతో హీరోలు, దర్శకులు, నిర్మాతలు ఏదో ఒక కొత్తదనంతో సినిమాలు తీస్తుండటంతో అవి బ్లాక్‌బ్లస్టర్లను అందుకోవటం తెలిసిందే. తాజాగా దక్షిణాది సినిమా పరిశ్రమలో ఇదో ట్రెండ్ కొనసాగుతోంది. క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాలు సెన్సేనల్‌గా మారుతున్నాయి. సాధారణంగా కొన్ని కాంబినేషన్లలో సినిమాలు వస్తున్నాయంటే చాలు ఆసక్తి మామూలుగా ఉండదు. సినిమా ఎలా ఉండబోతుందనే ఉత్సుకత సర్వత్రా కనిపిస్తుంటుంది. తాజాగా తమిళ హీరో సూర్యతో దర్శకురాలు సుధా కొంగర చిత్రం చేస్తుండటం తెలిసిందే. అలాంటి కాంబినేషన్‌లోనే హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని సినిమా కూడా హాట్ టాపిక్‌గానే మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న నాలుగో సినిమాపై సామాజిక మాధ్యమాల్లో స్పందన బాగా వస్తోంది. తమిళ హీరో కమల్‌హాసన్‌తో దేశంలోనే అగ్ర దర్శకుడు మణిరత్నం చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. మూడున్నర దశాబ్దాల తర్వాత వస్తోన్న వీరి కాంబినేషన్‌పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి నెలకొంది. 2024లో థియేటర్లలోకి రానున్న ఈ సినిమాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న పోస్టులకు ప్రేక్షకుల నుంచి స్పందన పెరుగుతోంది.

సూర్య–సుధ : 'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో కొత్త సినిమా తెరకెక్కనుంది. సూర్య 43వ సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, నటి నజ్రియా ఫాహద్, నటుడు విజయ్ వర్మ కీలక పాత్రల్లో నటించనున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై జ్యోతిక, సూర్య, రాజశేఖర్, కర్పూర సుందరపాండియన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ స్వరకర్త. అతనికి సంగీత దర్శకుడిగా ఇది నూరవ చిత్రం కావడం విశేషం. ఇదిలా ఉంటే.. 68వ జాతీయ అవార్డులలో ఉత్తమ నటుడు, ఉత్తమ నేపథ్య సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ చిత్రం విభాగాల్లో 'సూరరై పోట్రు' సినిమా అవార్డులు సాధించింది. తాజా చిత్రంతో సూర్య–సుధల కాంబో రిపీట్ అవుతోంది. తాజాగా కంగువ, వాడీవాసల్ చిత్రాల్లో సూర్య నటిస్తున్న విషయం తెలిసిందే.



రవితేజ–గోపీచంద్ మలినేని : క్రేజీ కాంబోల్లో రవితేజ –గోపీచంద్ మలినేని సినిమాలు కూడా నిలిచాయి. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన మూడు సినిమాలు బాక్సాఫీస్ వద్ద తమ మార్క్‌ను చూపించాయి. డాన్ శీను, బలుపు మంచి సక్సెస్‌ను అందుకున్నాయి. ఇక చాలా కాలంగా సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న రవిజేతకు క్రాక్ సినిమాతో బ్లాక్ బస్టర్ సెకండ్ ఇన్నింగ్స్ అందించాడు గోపీచంద్ మలినేని. రవితేజ కోసం గోపీచంద్ మలినేని మరో సినిమా కథను సిద్ధంచేశారు. ఆర్‌టి 4 జిఎం పేరుతో విడుదల చేసిన పోస్టర్లు తాజాగా ఆకట్టుకుంటున్నాయి. ధమాకా, వాల్తేరు వీరయ్య సినిమాలు విజయాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. టైగర్ నాగేశ్వరరావు సినిమా అంతగా మెప్పించలేకపోయింది. మలినేని గోపీచంద్ సినిమాపై ఇప్పుడు రవితేజ ఆశలు పెంచుకున్నారు.

కమల్‌హాసన్–మణిరత్నం : రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ క్రేజీ కాంబినేషన్‌లో కమల్ హాసన్ 234 చిత్రం 2024లో థియేటర్లోకి రానుంది. ఉలగనాయగన్ కమల్ హాసన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి మణిరత్నం దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం ఏఆర్ రెహమాన్ అందించనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన నాయగన్ కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. దాదాపు 35 సంవత్సరాల తర్వాత మరోసారి ఆ మ్యాజిక్ రిపీట్ కాబోతుంది. ఉలగనాయగన్ కమల్ హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మణిరత్నం మాట్లాడారు. కమల్‌తో మళ్లీ కలిసి పని చేయడం సంతోషంగా, గౌరవం, ఉత్సాహంగా ఉందని పేర్కొన్నారు. కెహెచ్234 పేరుతో సినిమా నిర్మాణానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు.

సిక్సర్‌తో సెమీస్‌కు!

సెమీఫైనల్లో టీమ్ ఇండియా
ఇంగ్లాండ్‌పై ఘన విజయం
ఐసిసి 2023 ప్రపంచకప్

టీమ్ ఇండియా 'సిక్సర్' కొట్టింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో వరుసగా ఆరో విజయం సాధించింది. 2023 ఐసిసి ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌కు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. లక్నోలో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన ఆతిథ్య భారత్ 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రోహిత్ శర్మ (87), సూర్య కుమార్ (49) మెరుపులతో తొలుత భారత్ 229 పరుగులు చేయగా.. షమి, బుమ్రా, కుల్దీప్ త్రయం ఛేదనలో ఇంగ్లాండ్‌ను కట్టడి చేశారు. ఆరో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరిన భారత్.. ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

లక్నో : అజేయ భారత్. ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ఓటమెరుగని జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం లక్నోలో ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను భారత్ చిత్తు చేసింది. 100 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 230 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. పేసర్లు మహ్మద్ షమి (4/22), బుమ్రా (3/32) సహా స్పిన్నర్ కుల్దీప్ (2/24) మాయ చేయటంతో ఇంగ్లాండ్ కుదేలైంది. లివింగ్‌స్టోన్ (27), మలన్ (16), డెవిడ్ విల్లే (16) ఆ జట్టులో టాప్ స్కోరర్లు. జో రూట్ (0), బెన్ స్టోక్స్ (0), జోశ్ బట్లర్ (10) చేతులెత్తేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 229 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (87, 101 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరువగా.. సూర్యకుమార్ యాదవ్ (49, 47 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), కెఎల్ రాహుల్ (39, 58 బంతుల్లో 3 ఫోర్లు) విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తొలి ఐదు విజయాలు ఛేదనలో సాధించగా.. ఈ మ్యాచ్‌లోనే లక్ష్యాన్ని కాపాడుకుని గెలుపొందారు. రోహిత్ శర్మ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

రాణించిన రోహిత్, సూర్య : పేస్‌కు అనుకూలించే పిచ్‌పై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు ఇంగ్లాండ్ పేసర్లు షాక్ ఇచ్చారు. 40 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన భారత్.. కష్టాల్లో కూరుకుంది. పవర్‌ప్లేలో పేసర్లు క్రిస్ వోక్స్, డెవిడ్ విల్లే పరుగుల నియంత్రణతో ఒత్తిడి పెంచగా.. స్పిన్నర్ ఆదిల్ రషీద్ మాయ చేశాడు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (9), విరాట్ కోహ్లి (0), శ్రేయస్ అయ్యర్ (4) విఫలమయ్యారు. విరాట్ కోహ్లి పరుగుల ఖాతా తెరువకుండానే నిష్క్రమించగా.. వోక్స్ పేస్‌కు అయ్యర్, గిల్ పడిపోయారు. ఈ పరిస్థితుల్లో రోహిత్ శర్మ (87) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కెఎల్ రాహుల్ (39)తో కలిసి నాల్గో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. 14.2 ఓవర్లలో 50 పరుగుల మార్క్ చేరిన భారత్.. ఆ తర్వాత ఏ దశలోనూ రన్‌రేట్ పుంజుకోలేదు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 66 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన రోహిత్ శర్మ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. కెఎల్ రాహుల్ సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ (49) జట్టులో స్థానానికి న్యాయం చేశాడు. జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. పది ఫోర్లు, 3 సిక్సర్లతో స్పీడ్ పెంచిన రోహిత్ శర్మ.. శతకానికి 13 పరుగుల దూరంలో వికెట్ కోల్పోయాడు.

స్పిన్ దిగ్గజం యాదిలో..

లక్నో : భారత క్రికెట్ స్పిన్ దిగ్గజం, మాజీ కెప్టెన్ బిషన్ సింగ్ బేడికి రోహిత్‌సేన సముచిత గౌరవం అందించింది. ఐసీసీ ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో బేడికి గౌరవ సూచకంగా నల్ల బ్యాడ్జిలతో టీమ్ ఇండియా బరిలోకి దిగింది. 1967–1979లో భారత్‌కు 67 టెస్టుల్లో ప్రాతినిథ్యం వహించిన బేడి 266 వికెట్లు పడగొట్టాడు. పది వన్డేల్లోనూ మాయ చేసిన బేడి భారత తొలి వన్డే విజయంలో కీలక పాత్ర పోషించారు. అమృత్‌సర్‌లో జన్మించిన బిషన్ సింగ్ బేడి.. 77 ఏండ్ల వయసులో గత సోమవారమే కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో బ్లాక్ ఆర్మ్‌బ్యాండ్స్ ధరించిన భారత క్రికెటర్లు దిగ్గజ క్రికెట్‌కు ఘన నివాళి అర్పించారు.

సెమీస్ ఒక్కటే కాదు! చాంపియన్స్ ట్రోఫీ బెర్తులు సైతం

దుబాయ్ : 2023 ఐసీసీ ప్రపంచకప్ రసవత్తర సమరాలు, సంచలన ఫలితాలతో సాగుతోంది. పది జట్లు పోటీపడుతున్న మెగా ఈవెంట్ గ్రూప్ దశలో టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ ప్రపంచకప్ గ్రూప్ దశ సమరం సెమీస్ బెర్తుకే పరిమితం కాదు. అంతకుమించి.. అని ఐసీసీ ఎప్పుడో తేల్చేసింది. అవును, టాప్–4లో నిలిచే అవకాశం లేదని దిగులు చెందాల్సిన అవసరం లేదు. ప్రపంచకప్‌లో టాప్–7లో నిలిచిన జట్లు 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి నేరుగా అర్హత సాధించనున్నాయి. గతంలో వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా అర్హత నిర్ణయించగా.. ఐసీసీ ఆ నిబంధనల్లో మార్పులు చేసింది. అసలు ప్రపంచకప్‌కు అర్హత సాధించని వెస్టిండీస్, జింబాబ్వే, స్కాట్లాండ్‌లు చాంపియన్స్ ట్రోఫీపై ఆశలు వదులుకోవాల్సిందే. దీంతో పాయింట్ల పట్టికలో దిగువన నిలిచిన జట్లు సైతం టాప్–7లో నిలిచేందుకు అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధం కానున్నాయి. 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌పై విజయంతో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. 2025 చాంపియన్స్ ట్రోఫీకి డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68